
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

5

గురువారం 3 ఏప్రిల్ 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.175	230	280
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.190	220	280

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.0 । కనిష్ఠం 23.4



సన్న బియ్యం.. సంతోషం

» బియ్యం పంపిణీ చేసిన తొలిరోజే వండుకున్న మహిళలు

» అన్నం బాగుందని కితాబిచ్చిన ఉమ్మడి జిల్లా మహిళలు

నల్లగొండ,ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం కింద తొలిసారి బియ్యం అందుకున్న మహిళలు ఆ బియ్యం బాగున్నాయని, అన్నం బాగా అయిందని సంబరపడుతున్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో, నల్లగొండ జిల్లా కనగల్ మండలం జి.యడవల్లిలో తొలిరోజు సన్నబియ్యం పొందిన మహిళలను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. ప్రభుత్వమిచ్చిన బియ్యాన్ని వారు వండి చూశారు.బియ్యం నాణ్యతతో ఉన్నాయని, గతంలో మార్కెట్లో తాము కొన్న సోనామసూరి, బీపీటీ తరహాలోనే ఈ బియ్యం కూడా ఉన్నాయని, పచ్చిబియ్యమే వచ్చిందని తెలిపారు. బియ్యం వండిన అన్నాన్ని కూడా 'ఆంధ్రజ్యోతి' బృందానికి చూపించారు. గతంలో ఇచ్చిన రేషన్ బియ్యం దొడ్డుబియ్యం వండిన తర్వాత ముద్దగా మారేదని, ఈ అన్నం అలా కాలేదని ఇది పొల్లుపొల్లుగా బాగుందని మహిళలు పేర్కొన్నారు. మొదటి నెల కింద పంపిణీ చేసిన సన్నబియ్యంపై జిల్లా పౌరసరఫరాల అధికారి హ రీష్‌ని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా, వానాకాలం కొనుగోలుచేసిన సన్నధాన్యానికి సంబంధించి సీఎంఆర్ కింద మిల్లుల ద్వారా వచ్చిన బియ్యాన్నే పంపిణీ చేశామని, పూర్తినాణ్యత కలిగిన పోర్టిఫైడ్ చేసిన బియ్యమే అన్ని రేషన్‌దుకాణాలకు సరఫరా చేశామని వెల్లడించారు.

అన్నం బాగుంది



మేం కూలి పనులు చేసుకొని జీవిస్తాం. మాకు రేషన్‌కార్డు కింద గతంలో దొడ్డుబియ్యం వచ్చేవి. వాటిని వండుకున్నప్పుడు వేడిగా ఉన్నప్పుడే తినేవాళ్లం. చల్లారాక ముద్దగా అయ్యేది. మధ్యాహ్నానికి తినలేకపోయేవాళ్లం. దీంతో రాత్రి మాత్రమే దొడ్డుబియ్యం వండుకునేవాళ్లం. ఉదయం, మధ్యాహ్నానానికి రేటు ఎక్కువైనా దుకాణాల్లో సన్న బియ్యం కొనుక్కొనేవాళ్లం. ఇప్పుడు సన్నబియ్యమే రేషన్‌కింద రావడం చాలా సంతోషాన్ని కలిగించింది.

- పెండెం పద్మ, సూర్యాపేట జిల్లా, గరిడేపల్లి

రేషన్‌దుకాణాల వద్ద రద్దీ

రేషన్‌దుకాణాల ద్వారా సన్న బియ్యం ఇస్తుండడంతో మంగళవారం సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లోని రేషన్ దుకాణాల వద్ద రద్దీ కొనసాగింది. గతంలో రేషన్ తీసుకోవడానికి పెద్దగా ప్రాధాన్యం..

- మిగతా 6వ పేజీలో...

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లాభాల బాటలో పయనిస్తోంది. 103 ఏళ్ల బ్యాంకు చరిత్రలో ఇప్పటి వరకు కేవలం రూ.900కోట్ల టర్నోవర్ ఉండగా, ప్రస్తుతం రూ.2,850కోట్లకు పైగా టర్నోవర్‌కు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం రూ.2,300 కోట్ల టర్నోవర్ ఉండగా, ప్రస్తుతం అదనంగా రూ.550.81కోట్ల టర్నోవర్ సాధించింది. మరో రూ.150 కోట్లు సాధిస్తే రూ.3వేల కోట్ల టర్నోవర్‌తో మరింత లాభాల బాటలో పయనించే అవకాశం ఉంది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

డీసీసీబీకి కాసుల వర్షం

» రికార్డు స్థాయిలో లాభాలు » రాష్ట్రంలో రెండో స్థానం » రూ.2850కోట్లకు పైగా టర్నోవర్

» ఎన్‌పీఏ 1.85శాతం నుంచి 1.38శాతానికి తగ్గుదల » పెరిగిన పంట, బంగారంపై రుణాలు, డిపాజిట్లు

డీసీసీబీలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆడిట్ ప్రకారం నికర లాభం రూ.42.31కోట్లు సాధించింది. 2023-24లో రూ.31కోట్లు లాభం ఉండగా,అదనంగా రూ.12.31కోట్లు లాభాలు సాధించింది. పాలకవర్గం ఎంసీ (మేనేజింగ్ కమిటీ) మీటింగ్‌లతో పాటు మహాజన సభలను నిర్వహిస్తూ అటూ సొసైటీ చైర్మన్లు, బ్యాంకుల సీఈవోలు, అధికారులు, ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ డీసీసీబీ లాభాల బాటలో ముందుకెళ్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో డీసీసీబీ పరిధిలో మొత్తం 107 సొసైటీలు ఉన్నాయి. రైతులకు రుణాలు పెద్ద మొత్తంలో ఇవ్వడంతో పాటు రికవరీ కూడా అంతే వేగంగా చేస్తున్నా రు.వాణిజ్య బ్యాంకుల కంటే అధికంగా రుణాలు మంజూరు చేశారు.బంగారంపై రుణాలు ఈ ఆర్థి క సంవత్సరంలో రూ.328.35కోట్ల నుంచి రూ.623. 91కోట్లకు పెరిగింది. అంటే అదనంగా రూ.295.56 కోట్ల మేర రుణాలు మంజూరు చేశారు. కొన్నేళ్ల క్రితం రాష్ట్రంలో ఉమ్మడి నల్లగొండ డీసీసీబీ స్థానం చివరి నుంచి రెండోదిగా ఉండగా, ప్రస్తుతం పైనుంచి రెండో స్థానానికి చేరింది. దీంతో జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు రాష్ట్రంతో పాటు ఆర్‌బీఐ వద్ద గుర్తింపు లభించింది.



పెరగనున్న కొత్త బ్రాంచ్‌లు, సొసైటీలు

ఉమ్మడి జిల్లాలో బ్రాంచ్‌ల సంఖ్య పెంచనున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో డీసీసీబీకి 36బ్రాంచ్‌లు ఉండగా, అదనంగా మరో ఐదు బ్రాంచ్‌లను త్వరలో ప్రారంభించనున్నారు.దీనికి తోడు మరో ఐదు బ్రాంచ్‌లను..

- మిగతా 6వ పేజీలో...

1.38 శాతానికి తగ్గిన నిరర్థక ఆస్తులు

2023-2024లో 1.85శాతంగా ఉన్న ఎన్‌పీఏ(నిరర్థక ఆస్తులు) ప్రస్తుతం 1.38శాతానికి చేరడంతో బ్యాంకు లాభాలు గడించింది. బ్రాంచ్ విస్తరణతో పాటు సొసైటీల బలోపేతం, ఆధునికీకరణతో రైతులకు సేవలను విస్తరించడంతో బ్యాంకు పురోగతికి చేరుకుంది. దీంతో పాటు ఎప్పటికప్పుడు ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడం, రైతులకు సత్వరమే సేవలు అందించడం, వాణిజ్య బాంకులకు దీటుగా రుణాలు అందిస్తుండటంతో లాభాలు పెరిగాయి. రానున్న రోజుల్లో స్వలకాలిక, దీర్ఘకాలిక, బంగారం, విద్య, వ్యక్తిగత రుణాలను పెంచే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. సహకార బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతుల్లో సైతం అవగాహన పెరిగింది. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లిస్తున్నారు. వడ్డీ భారం పడకముందే రుణాలు తిరిగి చెల్లించి రెన్యూవల్ చేసుకుంటున్నారు. దాదాపు 95శాతం మేర రైతులు సకాలంలోనే రుణాల చెల్లింపు చేస్తున్నారు. బ్యాంకుల నుంచి నోటీసులు రాకముందే రైతులే స్వయంగా వచ్చి రుణాలు చెల్లించి అవసరమైనంతా తిరిగి రుణం తీసుకునేలా రెన్యూవల్ చేసుకుంటున్నారు. దీనికి తోడు మార్టిగేజ్ రుణాలు అంటే భూములను తనఖా పెట్టి రుణాలు పొందుతున్న వారి సంఖ్య పెరిగింది. వారందరికీ ప్రోత్సాహకాలు కల్పిస్తూ సకాలంలో రుణాలు చెల్లించేలా చూస్తుండటంతో డీపాల్టర్ల సంఖ్య కూడా తగ్గింది.

బ్యాంక్ అభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గం కృషి



- కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పీఏసీఎస్‌లు, బ్రాంచ్‌లు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లు లాభాల బాటలో తీసుకెళ్లేలా పాలకవర్గం కృషి చేస్తోందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ లాభాల బాటలో పయనించిన సందర్భంగా బుధవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో సీఈవో శంకర్‌రావు, డైరెక్టర్లు పాశం సంపత్ రెడ్డి, గుడిపాటి సైదులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 103 ఏళ్లలో లేని అభివృద్ధిని తమ పాలకవర్గం చేయడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ఏటా నిర్వహిస్తున్న ఆడిట్ ద్వారా డీసీసీబీ పెద్ద ఎత్తున అభివృద్ధికి చేరుకుందనే విషయం స్పష్టమైందన్నారు. ప్రస్తుత పాలకవర్గం బాధ్యతలు చేపట్టాక రూ.2,850కోట్లకు పైగా బ్యాంక్ టర్నోవర్ చేరుకోవడంతో డీసీసీబీకి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం లభించిందన్నారు. త్వరలో మరో రెండు నెలల్లో రూ.3వేల కోట్ల టర్నోవర్‌కు చేరుకుంటామని, డిపాజిట్లను పెంచుకోవడం, బంగారం రుణాలను, స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను రైతులకు అందించడంతో పాటు రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందన్నారు. డీసీసీబీ బ్యాంకు అభివృద్ధికి సహకరించిన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రైవేట్ కళాశాలల్లో నిలిచిన ప్రాక్టికల్స్



భువనగిరిలోని ఓ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న యాజమాన్యాలు, లెక్చరర్లు

» డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, లెక్చరర్ల నిరసన

» ప్రభుత్వ కళాశాలల్లో కొనసాగిన పరీక్షలు

భువనగిరి టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, వేతనాల కోసం లెక్చరర్ల బహిష్కరణ ప్రభావం డిగ్రీ ప్రాక్టికల్స్ పరీక్షలపై ప్రభావం చూపింది. ఎంజీయూ పరిధిలోని ఉమ్మడి జిల్లాలో బుధవారం ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభమైనా, ప్రైవేట్‌డిగ్రీ కళాశాలలు తెరుచుకోలేదు. దీంతో ప్రైవేట్ కళాశాలల్లో ప్రాక్టికల్స్ స్తంభించగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రభుత్వ యాజమాన్య గురుకుల కళాశాలల్లో మాత్రం షెడ్యూల్ ప్రకారం పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వంతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో ప్రభుత్వం మొండివైఖరి వీడకుంటే ఈనెల 11 నుంచి ప్రారంభమయ్యే థియరీ పరీక్షలను కూడా బహిష్కరిస్తామని యాజమాన్యాలు ఇప్పటికే ప్రకటించాయి. దీంతో డిగ్రీ విద్యార్థులు,తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. అయితే రెండుమూడు రోజుల్లో సమస్య కొలిక్కి వస్తుందని, ప్రైవేట్ విద్యార్థులు నష్టపోకుండా పరీక్షల రీషెడ్యూల్‌ను ప్రకటిస్తామని ఎంజీయూ అధికారులు పేర్కొంటున్నారు.

నిరసనల పర్వం..

డిగ్రీ ప్రాక్టికల్స్ పరీక్షల మొదటి రోజున ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్ కళాశాలల వద్ద నిరసనల పర్వం కొనసాగింది. యాజమాన్యాల ప్రతినిధులు, లెక్చరర్స్ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. అయితే ప్రాక్టికల్స్‌ను బహిష్కరిస్తున్నట్టు ముందే ఇచ్చిన సమాచారంతో విద్యార్థులు కళాశాలలకు రాలేదు. ఏ-గ్రూపులో 2, 4, 5వ సెమిస్టర్ ప్రాక్టికల్స్ 7, 8, 9వ తేదీల్లో జరగనున్నాయి. ప్రాక్టికల్స్ ముగిసిన రెండు రోజుల అనంతరం ఈ నెల 11వ తేదీ నుంచి థియరీ పరీక్షలు ప్రారంభం కావలసి ఉంది.

ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె



పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె కొనసాగిస్తాం. భారీగా పేరుకుపోయిన బకాయితో యాజమాన్యాల ఆర్థిక స్థితిగతులు తలకిందులయ్యాయి. ప్రభుత్వ వైఖరి కారణంగానే ప్రాక్టికల్స్ పరీక్ష లు బహిష్కరిస్తున్నాం. అందుకు గత అక్టోబరులో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలుపుకోకపోవడమే కారణం. ప్రభుత్వ వైఖరి మారకుంటే ఈనెల 11 నుంచి ప్రారంభమయ్యే థియరీ పరీక్షలను కూడా బహిష్కరిస్తాం.

- బి.సూర్యనారాయణరెడ్డి, ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

పారదర్శకంగా సన్న బియ్యం పంపిణీ



లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీచేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పేదలకు సన్న బియ్యం పంపిణీని పారదర్శంగా నిర్వహిస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, మండలంలో ఖాళీగా ఉన్న చౌకధరల దుకాణాల డీలర్ల పోస్టులను యుద్ధప్రాతిపదికన భర్తీ చేస్తామన్నారు. రేషన్‌కార్డు జారీ నిరంతర ప్రక్రియ అని అన్నారు. రైతులు సన్న రకం ధాన్యాన్ని ఎక్కువగా సాగుచేయాలని, క్వింటా ధాన్యానికి రూ.2,320 మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ పొందాలని సూచించారు. ధర్తీ ఆబా యోజన కింద గిరిజన తండాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామన్నారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 14వరకు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేయాలన్నారు. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, మండల స్పెషల్ ఆఫీసర్, డీఆర్‌డీఏ ఏపీడీ శారద, సివిల్ సప్లయ్ జిల్లా అధికారి రమేష్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ అనిల్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, కలసాని చంద్రశేఖర్, ఆంగోతు భగవాన్ నాయక్, గడ్డం సాగర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

4,200 మంది రైతులకు పట్టాలు

మండలంలో ఆరు నెలలుగా నిర్వహిస్తున్న రెవెన్యూ పైలట్ ప్రాజెక్టును కలెక్టర్ సమీక్షించారు. సుమారు 4,700 ఎకరాలకు సంబంధించి 4,200 మంది రైతులకు పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఖాస్తు కబ్జాలో ఉండి వ్యవసాయం చేస్తున్న ప్రతీ రైతుకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు.

మహనీయుల జయంతిని నిర్వహించాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల జయంతిని నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహనీయుల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. అనంతరం పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ, జయంతి వేడుకల సందర్భంగా రిజిస్టర్డ్ సంఘం నుంచి ఒకరికి మాట్లాడే అవకాశం ఇవ్వాలని, మర్రిగూడ జంక్షన్‌కు అంబేడ్కర్ పేరు పెట్టాలని, అంబేడ్కర్ కల్చరల్ భవనానికి మరమ్మతులు చేయాలని, ఉత్సవాలకు హాజరయ్యే విద్యార్థులకు తాగునీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్ కుమార్, అదనపు ఎస్పీ రమేష్, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు, డీసీవో పత్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

మీ కోసమే.. మేమున్నామని..

●7లో..

» పేట జిల్లాలో 'పోలీస్ ప్రజా భరోసా'

» నూతనంగా ప్రారంభించిన ఎస్పీ నర్సింహ



శాంతిభద్రతల పరిరక్షణ, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పన, నేరాల నియంత్రణతో పాటు మీ కోసమే మేమున్నామని చెప్పేందుకు సూర్యాపేట జిల్లాలో నూతన కార్యక్రమానికి ఎస్పీ కొత్తపల్లి నర్సింహ శ్రీకారం చుట్టారు. అందుకోసం రాష్ట్రంలో ఎక్కడా అమలు చేయని విధంగా వినూత్నంగా 'పోలీస్ ప్రజా భరోసా' పేరిట కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి

డీఎంహెచ్‌వో శ్రీనివాస్



పీటీనగర్ పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చింతపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేసినప్పుడే గుర్తింపు ఉంటుందని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని వెంకటేశ్వరనగర్ (మాల్) పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, ఔషధాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు వడదెబ్బకు గురైనప్పుడు అందజేసేందుకు పీహెచ్‌సీలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్యపర సేవలందించి మన్ననలు పొందాలని సూచించారు. గ్రామాల్లో వడదెబ్బకు గురికాకుండా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వంశీకృష్ణ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో చివరి రోజు పరీక్ష రాసివస్తున్న విద్యార్థులు

ముగిసిన పదో తరగతి పరీక్షలు

చివరి రోజు 38మంది గైర్హాజరు

నల్లగొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారం ముగిశాయి. చివరి రోజు సాంఘికశాస్త్ర పరీక్షకు 38మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలోని 105 పరీక్షా కేంద్రాల్లో 18,666 మందికి 18,628మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, డీఈవో భిక్షపతి తెలిపారు. ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయి.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపాలి



నల్లగొండలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల వేలాన్ని, విద్యార్థులు, యూనియన్ నేతలపై పోలీసుల నిర్బంధాన్ని నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున, జిల్లా కమిటీ సభ్యుడు ఎండి సలీం డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని సుభాష్ విగ్రహం దగ్గర బుధవారం ప్లకార్డులు, నల్లరిబ్బన్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 400 ఎకరాల యూనివర్సిటీ భూమిని విక్రయానికి పెట్టే ప్రయత్నాలను విరమించాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన దశలో ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కు తీసుకుని విక్రయానికి పెట్టిందన్నారు. భూమిని విక్రయించవద్దని, యూనివర్సిటీ అభివృద్ధికే వినియోగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చిన్నపాక లక్ష్మీనారాయణ, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పుచ్చకాయల నర్సిరెడ్డి, కొండ అనురాధ, నలపరాజు సైదులు, కోట్ల అశోక్‌రెడ్డి, సత్యనారాయణ, పాల్గొన్నారు.

5న పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఈనెల 5న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువతేజం కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 9నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన యువతీ, యువకులు పేర్లను సమీప పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలో 100కుపైగా కంపెనీలు పాల్గొని 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయన్నారు. యువతీ, యువకులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భగవద్గీత శ్లోకాల పఠనంలో
పోచంపల్లి వాసికి గోల్డ్‌మెడల్


గణపతి సచ్చిదానందస్వామి నుంచి గోల్డ్‌మెడల్ అందుకుంటున్న సంగెం కృష్ణ

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత శ్లోకాల పఠనంలో యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణానికి చెందిన సంగెం కృష్ణ ప్రతిభ చాటారు. హైదరాబాద్ శివారులోని దుండిగల్‌లోని ప్రసిద్ధ గణపతి సచ్చిదానంద స్వామిజీ ఆశ్రమంలో బుధవారం కృష్ణ గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఆన్‌లైన్ ద్వారా భగవద్గీత శ్లోకాల పఠనం పోటీల్లో 18 అధ్యాయాల్లోని 702శ్లోకాలను అడిగిందే తడవుగా పఠించడంతో కృష్ణ ప్రతిభను అభినందించారు. భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని చేనేత పద్మశాలి కుటుంబీకులైన సంగెం రాములు- లలిత రెండో కుమారుడైన కృష్ణ పుట్టుకతో అంధుడు. అయినా భక్తిభావంతో శ్లోకాల కంఠస్థం చేశారు. బీఏ, ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసిన కృష్ణ ప్రస్తుతం హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నారు.

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

● మృతిపై అనుమానాలు ఉన్నాయని తండ్రి ఫిర్యాదు

దేవరకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పద్మట్‌పల్లిలో ఖననం చేసిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. సీఐ నర్సింహులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న షేక్ షబ్బీర్(14) గత నెల 18న పొలం వద్దకు వెళ్లి మృతి చెందాడు. కుమారుడు మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చెంది మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. కాగా ఏప్రిల్ 1న కుమారుడు షబ్బీర్ మృతిపై అనుమానాలున్నాయని తండ్రి జహంగీర్ దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దీంతో తహసీల్దార్ సంతోష్‌కిరణ్ సమక్షంలో ఖననం చేసిన శవాన్ని వైద్యుల బృందం వెలికితీసి బుధవారం పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వస్తే షబ్బీర్ మృతికి కారణాలు తెలుస్తాయన్నారు. జహంగీర్‌కు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉండగా కుమారుడు మృతితో ఆ కుటుంబం దుఃఖసాగరంలో మునిగిపోయింది.

కుక్కల దాడిలో దుప్పి మృతి


కుక్కదాడిలో మృతి చెందిన దుప్పిని పరిశీలిస్తున్న అధికారులు

మర్రిగూడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం సరంపటతండాలో కుక్కల దాడిలో దుప్పి మృతి చెందింది. గ్రామస్థులు మురళి, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రాములు చెప్పిన కథనం ప్రకారం బుధవారం ఉదయం దాహం కోసం గ్రామంలోకి వచ్చిన రెండేళ్ల వయస్సు ఉన్న దుప్పిపై ఊరకుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో దుప్పి అక్కడికక్కడే మృతి చెందింది. తండావాసులు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించినట్లు ఎఫ్‌ఆర్‌వో తెలిపారు. అనంతరం మర్రిగూడ వెటర్నరీ వైద్యులు రమేష్ పంచానామా నిర్వహించి అక్కడే ఖననం చేసినట్లు తెలిపారు. నివేదికను జిల్లా ఫారెస్టు అధికారులకు పంపనున్నట్లు ఎఫ్‌ఆర్‌వో తెలిపారు. ఆయన వెంట గ్రామస్థులు రమావత్ రవి, బీట్ ఆఫీసర్లు ఉన్నారు.

కుమార్తె సహా మహిళ అదృశ్యం


ప్రియాంక, ఆమె కుమార్తె షణ్ముక

హుజూర్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం మాధవరాయినిగూడెం గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైంది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చప్పిడి ప్రియాంక గత నెల 28న నడిగూడెం మండలం రామాపురంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లివస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిందని, ఆ తర్వాత ఆచూకీ లేదని భర్త రాము బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆమెతో పాటు కుమార్తె మూడేళ్ల షణ్ముక కూడా ఉందని, నాలుగు రోజులుగా వెతికినా ఆచూకీ లేకపోవడంతో భర్త ఫిర్యాదు చేశాడని, ఆ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళల రక్షణకు భద్రతా చర్యలు చేపట్టాలి

శాలిగౌరారం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు కిరణ్ అన్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గంలోని ఊర్కొండపేటలో వివాహితపై జరిగిన అత్యాచారాన్ని బీఎస్పీ తీవ్రంగా ఖండిస్తోందని, బాధితురాలికి న్యాయం చేయాలన్నారు. నిందితులందరికీ కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో అధికారులు మరింత వేగవంతమైన సమగ్ర దర్యాప్తు చేపట్టాలన్నారు. బాధిత మహిళలకు తగిన న్యాయం జరిగేలా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో వేముల లక్ష్మణ్, రజిత, బొడ్డు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటి ‘దీపాలు’





సర్వేంద్రియానం నయనం ప్రధానం అంటారు. అలాంటి నయనాల్లోని కార్నియా(కంటి పొర) లేక లక్షల మంది అంధత్వంతో బాధపడుతున్నారు. అలాంటి వారికి చూపు కల్పించేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్ కృషి చేస్తోంది. మరణించిన వారి కళ్ల(కార్నియా)ను సేకరించి అంధులకు అమరుస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది. 2024 ఆగస్టు 1 నుంచి ఇందుకు శ్రీకారం చుట్టిన ట్రస్ట్ ఇప్పటివరకు 97 మంది నుంచి 194 కార్నియాలను సేకరించింది. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా కార్నియాను సేకరిస్తూ సేవలందిస్తోంది.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

▸ కార్నియాలు సేకరిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్


▸ మృతుడి కార్నియాలతో మరో ఇద్దరు జీవితాల్లో వెలుగులు

▸ ఫలిస్తున్న ట్రస్ట్ ప్రయత్నాలు

మరణించిన వారి కళ్లలోని కార్నియా(కంటి పొర) అంధత్వం ఉన్న వారు చూపును పొందడానికి సహాయపడుతుంది. అలాంటి కార్నియా సేకరణలో లయన్స్ క్లబ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్ తీవ్రంగా కృషి చేస్తోంది. ట్రస్ట్ చైర్మన్‌గా కేవీ ప్రసాద్, ఎండీగా డాక్టర్ హరినాథ్, మేనేజర్‌గా డాక్టర్ పుల్లారావు, కౌన్సిలర్‌గా చిరునోముల చంద్రశేఖర్ క్షేత్రస్థాయిలో ఈ బాధ్యతలను ముందుకు తీసుకెళ్తున్నారు. ఒక వ్యక్తి నుంచి సేకరించిన కార్నియాల ద్వారా ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చు. అయితే మరణించిన ఆరు గంటల్లోపే కార్నియాలను సేకరించి కంటి బ్యాంక్‌కు పంపించాల్సి ఉంటుంది. అక్కడ కార్నియాను పరిశీలించి, నిల్వ చేస్తారు. అనంతరం అవసరమైన వారి కోసం ఉపయోగిస్తారు. వయస్సు, కంటిచూపు ఇతర వ్యాధులు ఉన్నప్పటికీ నేత్రదానం చేసే అవకాశం ఉంటుంది.

చావు విషయం చెవిన పడితే...

నేత్రాల సేకరణకు మృతుల వారి వివరాలు సేకరించడమే కీలకం. ఆ విషయం తెలుసుకోవడం, ఆ తరువాత వారి కుటుంబ సభ్యులను కలిసి నేత్ర దానం గురించి వివరించి ఒప్పించడం మొదట్లో ఇబ్బందిగానే ఉండేది. అయితే మృతుల వివరాల సేకరణ విషయంపై ఎక్కువగా దృష్టి పెట్టిన ట్రస్ట్ సభ్యులు అందుకోసం వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో శ్రద్ధాంజలి పోస్టింగ్స్, పట్టణ కూడళ్లలో ఏర్పాటు చేసే మృతుల ఫ్లెక్సీల ఫొటోలపై ఆధారపడ్డారు. దీంతో వివరాల సేకరణ కొంత సులువైంది. ఇదే సమయంలో కార్నియా దాతల ఫొటోలతో పాటు సేకరణ దృశ్యాలను సైతం సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తూ నేత్రదానంపై అవగాహన పెంచే ప్రయత్నంచేశారు. ఈ ప్రయత్నం ఫలించి ఆరు నెలల్లో నేత్రదానానికి ముందుకువచ్చే వారి సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఇలా ఫిబ్రవరి 15వ తేదీ నాటికి 97 మంది నుంచి 194 కార్నియాలను సేకరించారు. తొలి మూడు నెలలు పెద్దగా లేకపోయినా నవంబరు నుంచి నేత్ర దానం చేసే వారి సంఖ్య పెరిగింది. ఆగస్టులో 4, సెప్టెంబరులో 4, అక్టోబరులో 3 రాగా, నవంబరులో 10, డిసెంబరులో 16, జనవరిలో 20 మంది నేత్రదానానికి ముందుకొచ్చారు. ఫిబ్రవరి 15 నాటికి రోజుకు ఒకరిచొప్పున 18మంది నుంచి కార్నియా సేకరించారు. ‘ఇంతింతై వటుడింతై అన్నట్లు’గా నేత్రదానాల సంఖ్య పెరిగింది. రానున్న కాలంలో మరింత ఎక్కువగా సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు.



ఓ నినాదం.. ఇద్దరికీ చూపు ప్రదానం

‘చనిపోయిన వ్యక్తి నేత్రాలతో బతికి ఉన్న ఇద్దరు కళ్లలో వెలుగులు నింపవచ్చు’ అన్న నినాదంతో నల్లగొండ జిల్లా కేంద్రంగా లయన్స్ క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నేత్రదాన కార్యక్రమం ఉద్యమంలా కొనసాగుతోంది. నల్లగొండ లయన్స్ క్లబ్ భవన కేంద్రంగా గతేడాది ఆగస్టు 1 నుంచి చేపట్టిన ఈ నేత్రదాన కార్యక్రమానికి ప్రారంభంలో ప్రజల నుంచి స్పందన అంతగా లభించలేదు. రోజులు గడుస్తున్న కొద్దీ పెరిగిన అవగాహన, క్లబ్ చేస్తున్న కృషితో నేత్రదానానికి ఇప్పుడు ముందుకువస్తున్నారు.



సమాచార సేకరణనే పరీక్ష



మృతుల సమాచారం తెలుసుకోవడమే కీలకం. సమాచారం ఇస్తే గంటలోపే అక్కడికి చేరుకోగలం. మృతుల కుటుంబ సభ్యుల అంగీకారంతో కార్నియా సేకరణ చేస్తాం. సమాచారం తెలుసుకోవడమే మాకు పరీక్షగా మారుతోంది. ఇందుకోసం ఇప్పటికే పట్టణంలోని ఆస్పత్రులను సందర్శిస్తున్నాం. సోషల్‌మీడియాల్లో పోస్టులు గమనిస్తున్నాం. వివిధ సంస్థల ప్రతినిధులను సంప్రదిస్తున్నాం. ప్రారంభంతో పోలిస్తే సమాచార సేకరణ మెరుగైంది.

- చిరునోముల చంద్రశేఖర్, లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్ కౌన్సిలర్

కన్ను గుడ్డుపై పలుచటి పొరను సేకరిస్తాం



నేత్రదానం చేయడం చాలా సులువు. చనిపోయిన వ్యక్తి నుంచి మాత్రమే సేకరిస్తాం. అది కూడా కన్ను గుడ్డుపై ఉన్న పలుచని పొరను మాత్రమే సేకరిస్తాం. అందువల్ల ఎవరికీ ఇబ్బంది ఉండదు. కార్నియా సేకరణతో అంధులకు ప్రపంచాన్ని చూపించవచ్చు. దీంతో చనిపోయిన వ్యక్తి కళ్లకు జీవం పోసిన వాళ్లమవుతాం. ఈ క్రమంలో వివిధ సంస్థల, ప్రముఖుల భాగస్వామ్యం పెరగాల్సి ఉంది.

- డాక్టర్ హరినాథ్, లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్ ఎండీ

ప్రపంచాన్ని చూపించే అవకాశం కల్పించాలి



నేత్రదానంతో అంధులకు కంటి చూపు తెప్పించి ఈ అందమైన ప్రపంచాన్ని చూపించే అవకాశాన్ని కల్పించాలి. సేకరించిన నేత్రాలను 72గంటల్లోగా ఇద్దరు బాధితులకు శస్త్రచికిత్స ద్వారా అందించి కంటిచూపు తెప్పించవచ్చు. దీంతో వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపొచ్చు. ఆపరేషన్ అనంతరం 30 రోజుల్లో ఈ ప్రపంచాన్ని చూసే అవకాశాలు ఉంటాయి. ఎవరికైనా సందేహాలుంటే ఫోన్ నెంబర్ 9948143299లో సంప్రదించవచ్చు.

డాక్టర్ పుల్లారావు, లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్ మేనేజర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి


రిజ్వాన్(ఫైల్‌ఫొటో)

సూర్యాపేట క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి బైక్ అదుపుతప్పిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని నిర్మల ఆస్పత్రి సమీపంలో నివాసముండే మహ్మద్ రిజ్వాన్(31) మంగళవారం రాత్రి తన మిత్రుడు జేజేనగర్‌కు చెందిన ఆరీఫ్‌ను అతడి ఇంటి వద్ద దింపేందుకు వెళ్తున్నాడు. సద్దుల చెరువు కట్ట కిందఉన్న రోడ్డు నుంచి వెళ్తుండగా ఆవులు ఎదురుగా వచ్చాయి. వాటిని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడింది. ఈ ఘటనలో రిజ్వాన్ తలకు తీవ్రమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనకాల కూర్చున్న ఆరీఫ్‌కు గాయాలయ్యాయి. రిజ్వాన్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. రిజ్వాన్ సూర్యాపేటకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఇస్రార్ అహ్మద్ ఏకైక కుమారుడు కావడంతో విషయం తెలుసుకున్న ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ కక్కిరేణి శ్రీనివాస్‌తో పాటు మరికొందరు ఆయన నివాసానికి చేరుకుని మృతదేహం వద్ద నివాళులర్పించారు. తండ్రి అహ్మద్ ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఆటో ఢీకొని..

పెన్‌పహాడ్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న ధాన్యం లోడు ట్రాక్టర్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్‌ఐ గోపికృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేటలోని తాళ్లగడ్డకు చెందిన చినపంగు జనార్ధన్(35) ఆటో నడుపుకుంటూ పెన్‌పహాడ్ నుంచి సూర్యాపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సింగిరెడ్డిపాలెం గ్రామశివారులో చెరువుకట్ట సమీపంలో ధాన్యం లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ టైర్‌కు పంక్చర్ కావడంతో ఎడమవైపు ఉన్న ట్రాక్టర్‌ను ఆటో ఢీకొనడంతో డ్రైవర్ జనార్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. జనార్ధన్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళకు గాయాలు

మోత్కూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్రగాయమైంది. బుధవారం మోత్కూరు హైస్కూల్ చౌరస్తా సమీపంలో బీసు సరిత రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తోంది. దుప్పెల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై వేగంగా వెళుతూ ఆమెను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఆమెకు కాలు విరిగి గాయపడగా, బైక్‌పై వెళుతున్న యువకులు కూడా స్వల్పంగా గాయపడ్డారు. సరితను చికిత్స నిమిత్తం 108 వాహనంలో స్థానికులు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఈఎంటీ భాస్కర్, పైలెట్ ఎలేందర్ తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బైక్‌ను స్వాధీన చేసుకుని, గాయపడిన యువకులను కూడా ఆస్పత్రికి పంపించారు.

పరీక్షలు పూర్తి చేసుకున్న కుమారుడిని తీసుకువచ్చేందుకు వెళుతూ..


శ్రీనివాస్(ఫైల్‌ఫొటో)

తిరుమలగిరి(సాగర్)/ తిప్పర్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలు పూర్తిచేసుకున్న కుమారుడిని ఇంటికి తీసుకొచ్చేందుకు తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బోయగూడెం గ్రామానికి చెందిన వంగూరి శ్రీనివాస్(42) ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆయన కుమారుడు సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలోని గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. బుధవారం పదవ తరగతి పరీక్షల చివరిరోజు కావడంతో కుమారుడిని తీసుకువచ్చేందుకు ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం తిప్పర్తి సమీపంలో రోడ్డు క్రాస్ చేస్తుండగా అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో అతడిని చికిత్సకోసం నల్లగొండ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగానే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కొన్నేళ్లగా శ్రీనివాస్ తిరుమలగిరి(సాగర్) మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రస్తుతం అతను జనవిజ్ఞాన వేదికలో కీలకంగా పనిచేస్తూ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. శ్రీనివాస్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటన గురించి తెలుసుకున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి ఆసుపత్రికి చేరుకొని మృతదేహానికి పోస్టుమార్టం చేసేలా చర్యలు తీసుకున్నారు. అందరితో కలివిడిగా ఉండే తన స్వగ్రామానికి చెందిన శ్రీనివాస్ మృతి బాధాకరమని ఆయన అన్నారు. శ్రీనివాస్ మృతికి ప్రైవేట్‌ఉపాధ్యాయుల సంఘం సంతాపం తెలిపింది. కాగా శ్రీనివాస్ బావమరిది అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిప్పర్తి ఎస్‌ఐ సాయిప్రశాంత్ తెలిపారు.

మానసిక స్థితి సరిగా లేని మహిళ ఆత్మహత్య


అడ్డగూడూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మానసిక, ఆరోగ్యపరిస్థితి సరిగాలేని మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం చౌళ్లరామారం గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ నాగరాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మోత్కూరు పట్టణానికి చెందిన ఆరె సత్తమ్మ(55) కొంత కాలంగా అనారోగ్యంతో మానసికస్థితి కోల్పోయింది. మంగళవారం ఉదయం గ్రామంలోని తన కుమార్తె పంగ రేవతి ఇంటికి వచ్చింది. బుధవారం ఉదయం కుమార్తె కూలి పనికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమాయంలో సత్తమ్మ ఇంట్లో ఉరివేసుకుంది. తన మనుమడు శంశాత్ స్కూల్ నుంచి వచ్చి సత్తమ్మ ఉరివేసుకుని విషయాన్ని గమనించాడు.పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా అసుప్రతికి తరలించారు. సత్తమ్మ కుమార్తె రేవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసునట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో వరికోత మిషన్ హెల్పర్ మృతి

కట్టంగూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కట్టంగూరు పరిధిలో షార్ట్‌సర్క్యూట్‌తో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లాకు చెందిన రాజేష్(22) కొంతకాలంగా వరికోతమిషన్‌పై హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. కట్టంగూరు గ్రామానికి చెందిన రైతు వ్యవసాయ పొలంలో వరి కోస్తుండగా పక్కనే ఉన్న పొలంలోని బోరు మోటారు విద్యుత్ వైర్ వరికోత మిషన్‌పై పడింది. అక్కడే ఉన్న రాజేష్ ఆ వైర్‌ను తొలగించే క్రమంలో షార్ట్‌సర్క్యూట్ జరిగి తీవ్రగాయాలయ్యాయి. రాజేష్‌ను చికిత్స కోసం నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రాజేష్ తండ్రి శంకర్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీసీసీబీకి కాసుల వర్షం

(5వ పేజీ తరువాయి)


నల్లగొండలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి

ప్రతిపాదిస్తూ డీసీసీబీ అధికారులు ఆర్‌బీఐకి నివేదిక సమర్పించారు. గత ఆర్థిక సంవత్సరంలో తిప్పర్తి, ఆత్మకూర్, గరిడేపల్లి, నారాయణపూ ర్,దామరచర్లలో బ్రాంచ్‌ల ఏర్పాటుకు ఆర్‌బీఐ నుంచి అనుమతి లభించింది. అదేవిధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో మిర్యాలగూడ-2, శాలిగౌరారం, పెద్దవూర, మోతె, చిలుకూరు, నాంపల్లిలో ఆరు కొత్త బ్రాంచ్‌ల కోసం ఆర్‌బీఐ అనుమతి కోసం పంపించారు. ఇప్పటికే 107 సొసైటీలు ఉండగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 50 నుంచి 60 కొత్త సొసైటీలు ఏర్పాటు చేసి రైతులకు మరింత చేరువ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అదేవిధంగా గొర్రెలు, నాటుకోళ్ల పెంపకానికి ఎన్‌ఎల్‌ఎం స్కీం ప్రారంభించడంతో పాటు గోదాముల నిర్మాణం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితో పాటు సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు పెంచ డం,ఎరువుల అమ్మకం ద్వారా సొసైటీలను బలోపేతానికి కృషి చేస్తున్నారు.

డీఎస్పీని సస్పెండ్ చేయాలి


మండలకేంద్రంలో రాస్తారోకో చేస్తున్న మిర్యాల గ్రామస్థులు

నూతనకల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మిర్యాల మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మెంచు చక్రయ్యగౌడ్ హత్యలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అప్పటి డీఎస్పీ రవిని వెంటనే సస్పెండ్ చేయాలని చక్రయ్యగౌడ్ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలకేంద్రంలోని సూర్యాపేట-దంతాలపల్లి ప్రధాన రహదారిపై చక్రయ్య భార్య జయమ్మతో పాటు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చక్రయ్యగౌడ్ ప్రాణానికి ముప్పు ఉందని డీఎస్పీకి విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన చక్రయ్యను హత్య చేయడంలో నమ్ముకున్న నాయకుల హస్తం ఉండడం ఎంతో బాధాకరమని భార్య జయమ్మ రోదిస్తూ ఆవేదన వ్యక్తం చేసింది. ఆందోళన చేస్తున్న చోటుకు ఇన్‌చార్జి సీఐ రఘువీర్‌రెడ్డి చేరుకుని జిల్లా ఎస్పీ నర్సింహతో కల్పిస్తామన్న హామీ మేరకు రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో చక్రయ్య కుమార్తెలు సరిత, అనిత, వెంకన్న, గ్రామస్థులు దరిపెల్లి వీరన్న, మన్నెం దశరథ, అనంతుల శ్రీనివాస్, గోరుగంటి రామచందర్‌రావు, కనకటి పల్లవెంకన్న, కనకటి నగేష్, ఇరుగు కిరణ్, కాసా శంకర్, మన్నెం మహేష్, వేల్పుల కొమరయ్య, గుండగాని రమేష్, మెంచు నగేష్, వేల్పుల రఘు తదితరులు ఉన్నారు.


సన్న బియ్యం.. సంతోషం

(5వ పేజీ తరువాయి)


సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలోని రేషన్ దుకాణం వద్ద బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు

ఇవ్వనివారంతా ఈసారి దుకాణాల వద్ద క్యూకట్టారు. దీంతో ఒక్కొక్కరు రేషన్‌బియ్యం పొందేందుకు గంటన్నర నుంచి రెండుగంటల సమయం వేచిఉండాల్సి వచ్చిందని చెప్పారు. మొత్తంగా ఇలాగే సన్న బియ్యం కొనసాగిస్తే ఈ బియ్యమే తింటామని పలువురు లబ్ధిదారులు తెలిపారు.

ఎన్నడూ లేనంత సంతోషంగా ఉంది



మాలాంటి పేద కుటుంబాలకు సన్నబియ్యం అన్నం రోజూ తినే అదృష్టం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు. రేషన్‌షాపువద్ద గతంలో బియ్యం కోసం వెళితే, నిమిషాల్లో ఇచ్చేవారు. ఎవరూ తీసుకోకపోవడంతో తీసుకునేవాళ్లకి వెంటనే ఇచ్చేవాళ్లు. ఈ రోజు రేషన్‌షాపు వద్ద కిక్కిరిసిఉంది. బియ్యం తీసుకోవడానికి దాదాపు రెండు గంటలు పట్టింది. మేం తీసుకున్న బియ్యం బాగున్నాయి. అన్నం చాలా బాగా అయింది. మాకు బియ్యం కొనే బాధ తప్పింది.

ఆకారపు జ్యోతి, సూర్యాపేట జిల్లా గరిడేపల్లి గ్రామం


సన్నబియ్యం అన్నం బాగుంది



మాకు రేషన్‌బియ్యం కింద సన్నబియ్యం వచ్చాయి. మేం వ్యవసాయ కూలీలం. మాకు రేషన్‌కింద ఇచ్చిన బియ్యంతో అన్నం బాగా అయింది. మేం గతంలో మార్కెట్లో కొనే సన్నబియ్యం అన్నంలాగానే ఉంది. ప్రభుత్వమే ఉచితంగా సన్న బియ్యం ఇస్తుండడంతో మాలాంటి పేదకుటుంబాలకు బియ్యం ఖర్చు తగ్గుతుంది. మాకు బియ్యం అందించిన సీఎంకి, మంత్రి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు. ఒకటి, రెండు నెలలు ఇచ్చి ఆపకుండా కొనసాగించాలని కోరుతున్నాం.

గడ్డం సైదమ్మ, జి.యడవల్లి, నల్లగొండ జిల్లా

సూర్యాపేట డీఎస్పీగా పార్థసారధి


బాధ్యతలు స్వీకరిస్తున్న పార్థసారధి

సూర్యాపేట క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా సూర్యాపేట డీఎస్పీగా పార్థసారధి బుధవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. గత నెలలో నూతనకల్ మండలం మిర్యాల మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు చక్రయ్యగౌడ్‌కు హత్యకు గురయ్యాడు. తమకు ప్రాణహాని ఉందని చక్రయ్యగౌడ్ కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం వహించారన్న కారణంతో సూర్యాపేట డీఎస్పీ రవిని డీజీపీ కార్యాలయానికి అటాచ్‌చేశారు. అప్పటినుంచి కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రవి స్థానంలో నూతన డీఎస్పీగా వరంగల్ జిల్లా ఎస్‌బీ డీఎస్పీగా పనిచేస్తున్న పార్థసారధిని నియమించారు. కాగా డీఎస్పీ పార్థసారధి గతంలో ఉమ్మడి నల్లగొండజిల్లాలో ఎస్‌ఐగా, సీఐగా విధులు పలుచోట్ల పనిచేశారు.

చేనేత కార్మికులందరికీ త్రిఫ్ట్ స్కీం అమలు చేయాలి

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేనేత త్రిఫ్ట్ స్కీంతోపాటు ప్రభుత్వ పథకాలను అర్హులైన చేనేత కార్మికులందరికీ అమలు చేయాలని చేనేత అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం ఆవరణలో ధర్నా నిర్వహించారు. అనంతరం చేనేత సహకార సంఘంలోని డీవో బి.రాజేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అఖిలపక్షం నాయకులు కోడె బాలనర్సింహ, మిర్యాల కృష్ణమూర్తి, చిక్క కృష్ణ, చింతకింది రమేష్ మాట్లాడుతూ జియో ట్యాగ్ కలిగిన కార్మికులందరికీ త్రిఫ్ట్ స్కీం, అనుబంధ కార్మికులకు పూర్తిస్థాయి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో చేనేత నాయకులు కర్నాటి పురుషోత్తం, భారత భూషణం, ముసునూరి రాములు, రుద్ర భిక్షపతి, మంగళపల్లి శ్రీహరి, గుండు ప్రవీణ్ పాల్గొన్నారు.



దర్నా చేస్తున్న చేనేత అఖిలపక్షం నాయకులు

మీకోసమే మేమున్నామని..

- సూర్యాపేట జిల్లాలో 'పోలీస్ ప్రజా భరోసా'
- నూతనంగా ప్రారంభించిన ఎస్పీ



(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటక్రైం) : శాంతిభద్రతల పరిరక్షణ కోసం రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు గతంలో గ్రామ పోలీస్ అధికారి(వీపీవో) వ్యవస్థను తీసుకువచ్చారు. వీపీవో వ్యవస్థ ద్వారా గ్రామాలు, పట్టణాల్లో శాంతిభద్రతలను కాపాడేలా చర్యలు చేపట్టారు. కానీ కొన్నాళ్ల పాటు అమలులో ఉన్న ఈ వ్యవస్థ అమలుకు నోచుకుండాపోయింది. ఈ క్రమంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ నర్సింహ గ్రామీణ ప్రాంతాల్లో పోలీస్ సమాచార, సంబంధాల వ్యవస్థను బలోపేతం చేసేందుకు 'పోలీస్ ప్రజా భరోసా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీని ద్వారా గ్రామ సమస్యలు గుర్తించడం, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, అదేవిధంగా సమస్యలు సృష్టించే వ్యక్తులను గుర్తించి వారికి అవగాహన కల్పించనున్నారు. ప్రతీ గ్రామం, పట్టణాల్లోని వార్డులకు ఒక పోలీస్‌ను నియమించి వారి ద్వారా గ్రామ, వార్డు పూర్తి సమాచారం సేకరించనున్నారు. వారి పరిధిలోని గ్రామాలు, వార్డుల్లో చిన్న సంఘటన జరిగినా వెంటనే సమాచారం అందేలా చర్యలు చేపడుతున్నారు. క్షేత్రస్థాయిలో జరిగే ప్రతీ అంశంపై అవగాహన కలిగి ఉండేలా ప్రణాళిక రూపొందించారు. దీంతో నేరాలను నియంత్రించే చర్యలు చేపడుతున్నారు.

మంచిమార్గంలోకి తీసుకువచ్చేందుకు

గ్రామాలు, పట్టణాల్లో కొందరు అదేపనిగా సమస్యలు సృష్టిస్తుంటారు. వారితో శాంతిభద్రతలు అదుపుతప్పే అవకాశముంది. అలాంటి వారిని ముందుగానే గుర్తించి వారి పరివర్తనలో మార్పుతీసుకొచ్చేందుకు అవగాహన కల్పించనున్నారు. అప్పటికీ వారిలో మార్పు రాకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోనున్నారు. అయినప్పటికీ మారకపోతే రౌడీషీట్, పీడీయాక్టు కేసులు నమోదు చేయనున్నారు. ఇంకా మార్పు రాకపోతే తప్పని పరిస్థితుల్లో జిల్లా బహిష్కరణ చేసేలా చర్యలు చేపట్టనున్నారు. మంచివారికి భరోసా కల్పిస్తూ చెడుమార్గంలో పయనించే వారిలో మార్పు కోసం ప్రయత్నాలు చేయనున్నారు.

యువతను కాపాడేందుకే..

యువత ఇటీవల గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు అలవాటు పడి విలువైన జీవితాలను నాశనం చేసుకుంటోంది. అలాంటి వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించి వారిలో మార్పు తీసుకురానున్నారు. అదేవిధంగా రోడ్డు మానవ తప్పిదాలతో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ ప్రజా భరోసా ద్వారా అవగాహన కల్పించేందుకు కూడా చర్యలు చేపడుతున్నారు. అదేవిధంగా సైబర్ మోసాల బారిన పడకుండా అవగాహన కల్పించనున్నారు. వీటితో పాటు మరికొన్ని అంశాలను వివరిస్తూ ప్రజలకు పోలీసులు మరింత చేరువయ్యేలా చర్యలు చేపడుతున్నారు.

గ్రామాల సమగ్ర సమాచారం సేకరణ

పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని అన్ని సమాచారాలకు సంబంధించి సుమారు 100 అంశాలపై వివరాలను సేకరించనున్నారు. వాటిని గ్రామ చరిత్ర రిజిష్టర్‌లో నమోదు చేయనున్నారు. ముఖ్యంగా దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, గ్రామ విస్తీర్ణం, వ్యవసాయ భూ ముల వివరాలు, అక్షరాస్యత, నిరక్షరాస్యత, ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతులు, కూలీలు, భవనా లు, జనాభా, పురుషులు, మహిళలు, వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులు, రవాణా సౌకర్యం, రోడ్లు, తాగునీటి వసతి, వ్యాపార దుకాణాలు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, గ్రామపెద్దలు, గ్రామంలోని కులాల జాబితాతో పాటు మరి కొన్ని అంశాలను సేకరించనున్నారు. అదేవిధంగా పాతనేరస్థులు, రౌడీషీటర్లు, పాస్‌పోర్టు ఉన్న వారు, బ్యాంక్ ఖాతాల వివరాలు, విదేశాల్లో ఉన్న వారు, పేకాటఆడేవారు, గ్రామంలోని వాహనాల సంఖ్యతో పాటు గ్రామ సమస్యలు, జరిగిన అభివృద్ధి విషయాలను కూడా పూర్తిగా సేకరించనున్నారు.

ప్రతీ బుధవారం ఎనిమిది గ్రామాల్లో...

జిల్లాలోని ఎనిమిది సీఐల పరిధిలో ప్రతీ బుధవారం ఒక్కో చోట పోలీస్ ప్రజా భరోసా సమావేశాలు నిర్వహిస్తారు. ఆయా సర్కిల్ పరిధిలోని అత్యంత సమస్యాత్మక గ్రామాలు, పట్టణాల్లో అయితే వార్డులను ముందుగానే గుర్తించి ముందుగా అక్కడే సమావేశాలు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నారు. ఆ సమావేశాలకు డీఎస్పీలు హాజరుకానున్నారు. అదేవిధంగా ఎస్పీ సైతం ఏదో ఒక గ్రామంలో కానీ, వార్డులో నిర్వహించే సమావేశానికి హాజరుకానున్నారు. సమావేశాలు జరిగే గ్రామాలు, వార్డుల్లో ఆయా పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలతో పాటు పోలీస్ సిబ్బంది హాజరుకానున్నారు. ప్రజా భరోసా సమావేశం నిర్వహించే విషయాన్ని ముందుగా చేరవేసి ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉద్యోగస్తులు, రిటైర్డ్ ఉద్యోగులతో పాటు గ్రామస్థులందరూ హాజరయ్యేలా ప్రణాళిక రూపొందించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు చాలా మంది వెళ్తుండటంతో సమావేశాలను సాయంత్రం నిర్వహించనున్నారు.

చెడు నడవడిక ఉన్న వారిలో మార్పు కోసం

చెడు నడవడిక ఉన్న వారిలో మార్పుతేవడం కోసం 'పోలీస్ ప్రజా భరోసా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ప్రజల రక్షణ కోసం పోలీసులు ఉన్నారనే విషయాన్ని ప్రజల వద్దకు వెళ్లి చెప్పనున్నాం.చట్టాల గురించి అవగాహన కల్పిస్తాం. గ్రామ పూర్తివివరాలు పోలీస్ వద్ద ఉండే అవకాశముంది. శాంతిభద్రతలు అదుపులో ఉన్నప్పుడే ఆయా గ్రామాలు అభివృద్ధి చెందనున్నాయి. చట్టాలను ఉల్లంఘించే వారి పట్ల కఠినంగా ఉంటూ వారిలో మార్పుకు చర్యలు చేపట్టనున్నాం.

-కొత్తపల్లి నర్సింహ, ఎస్పీ

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	518.40
టీఎంసీలు	146.3750
ఎడమకాల్వకు నీటి విడుదల	6,248
కుడికాల్వకు	4,050
విద్యుత్ కేంద్రం ద్వారా	7,913
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	1,800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	3,598
అవుట్‌ఫ్లో	20,311

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	33.71 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	300 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	625.67 అడుగులు
టీఎంసీలు	0.90
కాల్వలకు విడుదల	469.44 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	500.10 క్యూసెక్కులు

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

దివ్యాంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య



జై బాపు భీమ్ జై సంవిదాన్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

అనంతగిరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి):రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దివ్యాంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాలని అఖిల భారత కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన జై బాపు జై భీమ్ జై సంవిదాన్ అభియాన్ కార్యక్రమం సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని గోండ్రియాల గ్రామంలో బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని కాపాడటమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా జై బాపు జై భీమ్ జై సంవిదాన్ అభియాన్ చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, కొండపల్లి వాసు, బుర్ర పుల్లారెడ్డి, బాబునాయక్, ఈదుల కృష్ణయ్య, మాగి నరేష్, నెల్లూరి వెంకటప్పయ్య, ఏటుకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

కేవీకే ఇన్‌చార్జి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ నరేష్



కేవీకేలో చిరుధాన్యాలతో లడ్డూ తయారీపై శిక్షణ పొందుతున్న మహిళలు

గరిడేపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని కేవీకే ఇన్‌చార్జి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి.నరేష్ అన్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి కేవీకేలో షెడ్యూల్డ్ తెగల మహిళలకు మూడ్రోజుల శిక్షణను ప్రారంభించి ఆయన మాట్లాడారు. చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు మొదలగు వాటితో బేకరి ఉత్పత్తులు రాగిలడ్డూ, జొన్న బిస్కెట్లు, జొన్న మురుకులు తయారు చేయవచ్చన్నారు. మహిళలు గ్రూప్‌గా ఏర్పడి మిల్లెట్ బేకరి యూనిట్ పెట్టుకోవాలని మహిళలకు సూచించారు. చిరుధాన్యాల్లో కాల్షియం, ఐరాన్, మెగ్నీషియం, భాస్వరం, అనే ఖనిజాలు అధిక మొత్తంలో ఉంటాయన్నారు. రోగ నిరోధక శక్తిని కలిగి మనుషులకు ఆర్యోగకరంగా ఉంటుందని తెలిపారు. అ నంతరం, వాటి తయారీపై అవగాహన కలిగించారు. మిర్యాలగూడ పట్టణానికి చెందిన రాణి చిరుధాన్యాల బేకరీ యూనిట్ పెట్టుకొని తన అనుభవాలను శిక్షణ పొందే మహిళలకు తెలిపారు. కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎన్.సుగంధి పాల్గొన్నారు.

యాదగిరీశుడికి నిత్య పూజలు



ప్రాకార మండపంలో నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతకపఠనాలతో హవనం గావించారు అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విష్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరు కల్యాణోత్సవ పర్వాలు ఆగమ శాస్త్ర రీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు ఆంకార వెండి జోడు సేవలు, సహస్ర నార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 16,69,207 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ భాస్కర్‌రావు తెలిపారు.

బై.. బై..

ముగిసిన పదో తరగతి పరీక్షలు



నల్లగొండ జిల్లా కేంద్రంలో పరీక్షలు ముగిసిన ఆనందంలో విద్యార్థినులు

మార్చి 21న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు బుధవారంతో ముగిశాయి. దీంతో విద్యార్థులు పరీక్ష హాల్ నుంచి బయటకు వస్తూనే కేరింతలు కొడుతూ సందడి చేశారు. హాస్టల్ విద్యార్థులు తమ సామగ్రితో ఇంటికి బయలు దేరడం కనిపించింది. కొత్తగా పరిచయమైన స్నేహితుల నుంచి చిరునామాలు తీసుకొని సెల్ఫీ దిగారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



భువనగిరిలో హాస్టల్ నుంచి సామగ్రితో ఇంటికి బయలుదేరుతున్న విద్యార్థి



ఆత్మకూరు. ఎస్ మండలకేంద్రంలో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు



మోటకొండూరులో కేరింతలు కొడుతున్న విద్యార్థినులు



మిర్యాలగూడ బస్టాండ్‌లో విద్యార్థుల రద్దీ

వేసవి కాలం.. వాహనాలు జరభద్రం

- ముందు జాగ్రత్తతోనే ప్రమాదాల నివారణ
- ఎండ కాలంలో నీడలో వాహనాలు ఉంచాలి
- ఎలక్ట్రిక్ వాహనాదారులు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి



మండుటెండలో ఉన్న వాహనాలు



వేసవి ప్రారంభంలోనే ఎండలు మండి పోతున్నాయి. పగటి పూట అడుగుబయట పెట్టాలంటే ప్రజలు జంకుతున్నారు. అయితే భానుడి ప్రతాపంతో మనుషులే కాదు వాహనాలకు ప్ర మాదం పొంచి ఉంది. దీంతో వాహనదారులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచి స్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-భువనగిరి రూరల్)

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో ఎండవేడికి షార్ట్ సర్క్యూట్ జరిగి ఇటీవల కారు మంటల్లో చెలరేగి దగ్ధమైంది. ఈ నేపథ్యంలో వేసవిలో వాహనదారులు ప్రయాణించాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అత్యధిక ఉష్ణోగ్రతలతో వాహనాలకు ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని గుర్తించాలి. వాహనాల్లో ఇంజన్, విద్యుత్ సరఫరా చేసే వైర్లలో సమస్యలు తలెత్తి మంటలు చెలరేగే అవకాశం ఉంది. వేసవిలో పగటిపూట వేగంగా వెళ్తున్న సమయంలో ఇతర వాహనాలను ఢీ కొన్న క్రమంలో పెట్రోల్, డీజిల్ లీకై మంటలు అంటుకునే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో నడుస్తున్న వాహనం నిలిపి ఉన్న వాహనం నుంచే అకస్మాతుగా మంటలు చెలరేగుతాయి. వాహనాల్లోని వైరింగ్‌లో నాణ్యత లోపం ముఖ్యంగా ఇంజన్ వేడెక్కడం, ఆయిల్, డీజిల్, పెట్రోల్, గ్యాస్ లీకేజీ కారణంగా మంటలు అంటుకునే ప్రమాదం ఉంది. వేసవిలో పాత వాహనాలు ఎక్కువగా ప్రమాదాలు గురయ్యే అవకాశం ఉంది. వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించుకోవాలి. వేసవిలో వాహనాల ఇంజన్ వేడెక్కుతుంటాయి. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ప్రస్తుతం ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, కార్లువేల సంఖ్యలో నడుస్తున్నాయి. వేసవిలో ఎలక్ట్రిక్ వాహనాలు త్వరగా వేడెక్కి మంటలు అంటుకునే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎలక్ట్రిక్ వాహనాల ను చార్జింగ్ చేసే సమయంలో ఎక్కువ దూరం వెళ్తున్న సందర్భాల్లో వాహనా దారులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

మంటలు రావడానికి కారణాలివే..

- వాహనాల్లో వాడుతున్న ఇంజన్ ఆయిల్, పెట్రోల్,గ్యాస్ మండే స్వభావం ఉంటుంది.
- వేసవిలో ఇంజన్ త్వరగా వేడెక్కుతుంది. దూర ప్రయాణంలో మధ్యలో కొద్ది సేపు విరామం తీసుకోవాలి .
- ఇంధనాలు ఏమాత్రం లీకేజీఅయిన వేడికి మంటలు వచ్చేందుకు అవకాశం ఉంటుంది.
- వాహనాల్లో నాణ్యత లేని వైర్లు వాడడంతో స్పార్క్ వచ్చి మంటలు అంటుకునే ప్రమాదం ఉంది.
- వాహనాల్లో ఫ్లగ్ లైట్స్, సెల్‌ఫోన్ చార్జ‌లు, ఇతర లైట్స్ వంటి అదనంగా బిగించడంతో వైరింగ్‌పై లోడ్ పడి దెబ్బతింటాయి.
- పాత వాహనాలకు గ్యాస్ కిట్లను అమర్చినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే లీకేజీ కారణంగా మంటలు అంటుకుంటాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ప్రతి కారు నిర్ణీత సమయంలో సర్వీస్ చేయించుకోవాలి.
- 10వేల కిలోమీటర్లు తిరిగిన తర్వాత వాహనం ఇంజన్‌లో ఉండే ఆయిల్ ఫ్రింటర్లను మార్చుకోవాలి.
- కారు నుంచి మంటలు వచ్చినప్పుడు దూరంగా ఉండాలి.
- అటు వైపు ట్రాఫిక్ రాకుండా చూడాలి. వాహనంలో ఉన్నప్పుడు మంటలు కాలుతున్న వాసన వస్తే వాహనాన్ని వెంటనే నిలిపివేసి తనిఖీ చేసుకోవాలి.
- మండే స్వభావం ఉన్న గ్యాస్ డబ్బాలు, ఇంధనాలు తీసుకవెళ్లకుండా జాగ్రత్తలు వహించాలి.
- కారు ఇంజన్ కూలింగ్ కోసం కూలెంట్ వాటర్‌ను పోయాలి. ఇది ఇంజన్ వేడెక్కకుండా కాపాడుతుంది.
- తరుచు ఇంజిన్ ఉష్ణోగ్రతను తనిఖీ చేస్తు ఉండాలి.
- గుర్తింపు పొందిన సెంటర్‌లోనే వాహనాలను సర్వీసింగ్ చేయించాలి.

వైరింగ్ నాణ్యత లోపంతో షార్ట్ సర్క్యూట్

బైకు, కారు, జీపు, ఇతర వాహనాల్లో నాణ్యత లేని వైర్లను ఉపయోగించడంతో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకుని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ఆయా వాహనాల త యారీ సమయంలో దాని సామర్థ్యాన్ని తట్టుకునే విధంగా పంపిణీ వైర్ ఫిట్టింగ్ ఉంటుంది. వాహనాల్లో వైరింగ్ దెబ్బతిన్న విషయం గుర్తించకపోవడం, వైరు ఒక్కదానికొక్కటి కలవడంతో మం టలు అంటుకుని ప్రమాదాలు జరుగుతున్నాయి.



వాహనాల్లో పెట్రోల్, డీజిల్, గ్యాస్ లీకేజీలు గమనించకుంటే ఎండలకు ఇంజిన్ వేడెక్కి అటాత్తుగా మంటలు వ్యాపిస్తాయి. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల యజమానులు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండ తీవ్రత దృష్ట్యా వాహనాలను నీడలోనే పార్కింగ్ చేసి ఉంచాలి.

-మధుకర్, ఫైర్ ఆఫీసర్,భువనగిరి

30 వరకు ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పొడగింపు

నల్లగొండ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ రాయితీ గడువును పొడిగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 31న ఎల్ఆర్ఎస్ రాయితీ ముగియడంతో ప్రజల నుంచి విజ్ఞప్తుల మేరకు ఈనెల 30వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. లేఅవుట్ల క్రమబద్ధీకరణకు సర్కార్ ప్రకటించిన 25శాతం రాయితీతో మరిన్ని రిజిస్ట్రేషన్లు జరగనున్నాయి. పలు రకాల కారణాల వల్ల ఫీజుల చెల్లింపులో ఇబ్బందులు తలెత్తాయని ప్రజలు పేర్కొనడంతో ప్రభుత్వం గడువు పొడిగించింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీట్‌మార్కెట్ సమీపంలో గల 11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు ఏడీఈ వేణుగోపాలచార్యులు తెలిపారు. ఈ కారణంగా గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పంచముఖ హనుమాన్ ఆలయం, రామగిరి, గాంధీనగర్, బీట్‌మార్కెట్ ఏరియా, సీతారామచంద్రస్వామి ఆలయం, క్లాక్‌టవర్, సావర్కర్‌నగర్, ఎన్‌జీ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు.



ఇండోర్ స్టేడియం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సామేలు

అన్ని హంగులతో ఇండోర్ స్టేడియం

ఎమ్మెల్యే సామేలు

శాలిగౌరారం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అన్ని హంగులతో ఇండోర్ స్టేడియం నిర్మిస్తామని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. ఇండోర్ స్టేడియం నిర్మాణానికి బుధవారం శాలిగౌరారం పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో క్రీడాకారులు ఇబ్బందులు పడకుండా అన్ని వసతులతో ఇండోర్ స్టేడియం నిర్మిస్తామన్నారు. ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ, ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్థలం అనువుగా ఉందని, దీనిపై కలెక్టర్‌కు నివేదిక పంపుతానన్నారు. వారి వెంట తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీవో జ్యోతి లక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు అన్నెబోయిన సుధాకర్, గూని వెంకటయ్య, పాదూరి శంకర్‌రెడ్డి, నరిగె నర్సింహ, భూపతి అంజయ్య, షేక్ ఇంతియాజ్ అహ్మద్, నోముల జనార్దన్, బోడ విజయకుమార్, ననుబోతు అంజయ్య, పుల్లూరి దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నార్కట్‌పల్లిలోని వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో రెండు రోజుల పాటు నిర్వహించే శ్రీరామనవమి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ దోసపాటి ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు సామ కొండల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ఐతరాజు రమేష్ సభ్యులు జెనిగె బిక్షం, ఆరకట్ల సాంబశివరావు, పుల్లెంల లింగయ్య, కొప్పు నర్సింహ, లింగాల రాములు, విజయలక్ష్మి, పాశం పూలమ్మ, కొప్పు భాగ్యమ్మ, సత్తమ్మ, భాస్కర్, రమేష్, కోటయ్య, వేణు, పుల్లయ్య, వీరప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

చండూరు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): చండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం శీతాకాల ప్రత్యేక శిబిరం బుధవారంతో ముగిసింది. మండలంలోని కస్తాల గ్రామంలో ఏడు రోజులుగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలో వివిధ కార్యక్రమాలు చేపట్టారు. వీధులు, రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాలలు, పరిసర ప్రాంతాలు శుభ్రం చేశారు. గ్రామస్థులకు పచ్చదనం పరిశుభ్రత, యువతకు యాంటీ డ్రగ్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్‌శ్యామ్ హాజరై మాట్లాడారు. అనంతరం వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఐ.శ్రీనివాస్, గ్రామ స్పెషల్ ఆఫీసర్ వి.నర్సింహ, కళాశాల అధ్యాపకులు, పంచాయతీ కార్యదర్శి సందీప్, వలంటీర్లు పాల్గొన్నారు.

శాలిగౌరారం ఇన్‌చార్జి ఎంపీవోగా సుధాకర్

శాలిగౌరారం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం ఎంపీఓగా బానోత్ సుధాకర్ నియమితులయ్యారు. శాలిగౌరారం ఎంపీఓ గా పని చేసిన అల్లూరి పద్మ ఇటీవల పదవీ విరమణ పొందారు.నార్కట్‌పల్లి ఎంపీఓగా పని చేస్తున్న బానోత్ సుధాకర్‌ను శాలిగౌరారం ఇంచార్జి ఎంపీవోగా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

రేపటి నుంచి సన్నబియ్యం పంపిణీ

మర్రిగూడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలో సన్నబియ్యం నిలిచిపోయింది. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఈ నెల 4వ తేదీన లాంఛనంగా ప్రారంభిస్తారని అప్పటి వరకు పంపిణీ నిలిపివేయాలని చండూరు రెవెన్యూ అధికారి తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ బుధవారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని నిలిపివేయాలని సూచించారు. ఈ నెల 4వ తేదీ వరకు సన్నబియ్యం పంపిణీ నిలిపివేయాలని డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు.


ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి : ఎంపీడీవో



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో యాదగిరి

చండూరురూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి కూలీలు తక్కువగా ఉన్నారని, వెంటనే కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో బండారు యాదగిరి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత వేసవి కాలంలో మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. గ్రామాల్లో ఉన్న నర్సరీ మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మొక్కలకు రెండు పూటలా నీళ్లు అందించాలని, ఎండిపోయిన మొక్కల స్థానంలో వాటిని పెట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో మాధవరెడ్డి, ఏపీవో శ్రీనివాస్, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఉట్కూర్‌లో సాగర్ నీటిపైపు లీకేజీ



ఉట్కూర్‌లో పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు

శాలిగౌరారం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉట్కూర్ గ్రామంలో సాగర్ నీటి ప్రధాన పైపులైన్ నుంచి నీరు వృథాగా లీకవుతోంది. పైపులైన్ పగిలి వారం రోజులైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా ఈ ప్రాంతంలోనే నీరు లీకవుతుండగా, నాడు తూతూ మంత్రంగా పనులు చేసి వదిలేశారు. మళ్లీ కొద్ది రోజులకే లీకవుతోందని, దీంతో నీరు అవుతోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఆరు గ్యారెంటీల అమలులో విఫలం

మునుగోడు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మండల ఇన్‌చార్జి చోల్లేటి బ్రహ్మచారి, పార్టీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య విమర్శించారు. మునుగోడు మండలం పలివెల, సింగారం గ్రామ బూత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద రూ.2,500, వృద్ధులకు రూ.4,000, విద్యార్థినులకు స్కూటీలు, ఆడపడుచులకు తులం బంగారం ఇవ్వడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు నకరకంటి లింగస్వామి, బొబ్బిలి యాదయ్య, అక్కినపల్లి సతీష్, కర్నాటి శేఖర్, ఏర్పుల క్రాంతి కుమార్, కొత్త శంకర్, లోడ నరసింహ, పాల్గొన్నారు.

మండుటెండలో నీడ కరువు



నాంపల్లి మండల కేంద్రంలో సెంటర్ వద్ద ఎండలో ప్రయాణికులు

- బస్టాండ్ లేక ప్రయాణికు ఇబ్బందులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు,
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నాంపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రోడ్డుపైనే నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నీడ కోసం పక్కనే ఉన్న దుకాణాలను ఆశ్రయించాల్సిందే. షాపు యజమానులు చీదరించుకున్నా, తిట్టినా బస్టాండ్ లేకపోవడం దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తుంది. ప్రయాణికులు చంటి పిల్లలతో వచ్చినా కూర్చోవడానికి వసతులు లేవు. పేరుకే మండల కేంద్రం ఒక్క మరుగు దొడ్డి కూడా లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఏదో ఒక పని మీద ఆయా గ్రామాల చెందిన ప్రజలు నిత్యం మండల కేంద్రానికి వస్తూనే ఉంటారు. అదే విధంగా శనివారం మండల కేంద్రంలో సంత జరుగుతుంది. దానికి కూడా ప్రజలు నిత్యావసర సరుకుల కోసం, సంతలో దొరికే కూరగాయల కోసం మహిళలు వస్తుంటారు.

మండలంలో జనాభా

నాంపల్లి మండలంలో 32 గ్రామ పంచాయతీ 28 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 39,775 మంది ప్రజలు ఉన్నారు. ఈ 14 సంవత్సరాల కాలంలో జనాభా దాదాపు పెరిగి 50 నుంచి 65 వేల వరకు దాదాపు ఉంచ వచ్చు.

వసతులు కల్పించడంలో విఫలం

పేరుకు మండల కేంద్రమైనా కనీసం బస్టాండ్ ఏర్పాటు చేయడంలో, ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా అంగడి బజార్, బస్టాండ్ సెంటర్, అంబేడ్కర్ చౌరస్తా అంటూ మండల కేంద్రం మూడు సెంటర్లు ఉన్నాయి. అదేవిధంగా జడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా పాఠశాలలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు ప్రతీ రోజు విద్యార్థులు, ఉద్యోగస్థులు నాంపల్లిలో ఉండే మూడు సెంటర్ల వద్ద బస్సుల కోసం దుకాణాల ఎదుట ఎదురుచూస్తుంటారు.



ప్రస్తుతం రోజు రోజుకూ ఎండలు పెరుగుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థినులు ఆటోలు, బస్సుల కోసం గంటల తరబడి ఎదురు చూస్తూ తమ ఇబ్బందులను ఎవరికి చెప్పుకోలేక నానాఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌తో పాటు మరుగుదొడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

బస్టాండ్ లేక ఇబ్బందులు



పేరుకే మండల కేంద్రం, ఇక్కడ బస్టాండ్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నిలబడటానికి స్థలం లేక చంటి పిల్లలతో వచ్చే బాలింతలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. బస్టాండ్‌తో పాటు మ రుగుదొడ్లు నిర్మించి ప్రయాణికుల ఇ బ్బందులను పరిష్కరించాలి.

\- పార్వతమ్మ, టీడీపీ మండల అధ్యక్షురాలు, నాంపల్లి

బస్టాండ్‌ను నిర్మించాలి



మండల కేంద్రంలో బస్టాండ్‌ను నిర్మించాలి. మగవారు అయితే టీ స్టాల్, లేకపోతే హోటల్‌లో నీడకు కూర్చుంటారు. చంటి పిల్లలతో వచ్చే వారు నీడ లేక ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని బస్టాండ్‌ను నిర్మించాలి.

\- వట్టికోటి నరేష్, గౌరారం

సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మకం



కట్టంగూరులో సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం, జేసీ శ్రీనివాస్

● ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూరు, నార్కట్‌పల్లి, చిట్యాలరూరల్, చిట్యాల, కేతేపల్లి, నకిరేకల్, నల్లగొండ టౌన్, తిప్పర్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమ కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యాన్ని పేద ప్రజలకు పంపిణీ చేయడం దేశ చరిత్రలోనే చరిత్రాత్మక ఘట్టమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బుధవారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సన్నబియ్యం పంపిణీతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై రూ. 10వేల కోట్ల అదనపు ఆర్థికభారం పడుతుందని, అయినా పేదలకు కూడా సన్నబియ్యం అందజేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అన్నారు. రేషన్‌బియ్యం దందా గత పాలకులకు, దళారులకు మాఫియాగా మారి ఆదాయ వనరుగా మారిందన్నారు. పేద ప్రజల ఆకలి తీర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేతమైన సన్నబియ్యం పథకాన్ని ప్రవేశపెట్టడం గర్వకారణమన్నారు. డీలర్లు సమయపాలన పాటిస్తూ సక్రమంగా బియ్యం పంపిణీ చేయాలన్నారు. కట్టంగూరులో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి కోటేశ్వర్‌రావు, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, ఎస్ఐ రవీందర్, నాయకులు నర్సింహ, మాద యాదగిరి, సుక్కయ్య, తదితరులు పాల్గొన్నారు. నార్కట్‌పల్లి మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 30లక్షల మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారని పరిశీలించి అర్హత ఉన్నవారందరికీ తమ ప్రభుత్వం రేషన్‌కార్డులను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎస్‌వో చరిత, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో ఉమేష్‌చారి పాల్గొన్నారు.

చిట్యాలమండలంలోని పెద్దకాపర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి, మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, తహశీల్దార్ కృష్ణానాయక్, ఎంపీడీవో జయలక్ష్మి, ఎంపీవో సత్యనారాయణ, డీలర్ చంద్రకళయాదగిరి పాల్గొన్నారు.

కేతేపల్లిలో డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ళ వెంకటరెడ్డితో కలిసి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నకిరేకల్ మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజుల, తహసీల్దార్ ఎస్.మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సన్న బియ్యం పంపిణీ : ఆర్డీవో

సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలుచేయాలని నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని తులసీనగర్‌లో బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన డీఎస్వో హరీష్, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మారగోని నవీన్‌కుమార్‌గౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్, పారెపల్లి నాగరాజు, సత్యనారాయణ, వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

తిప్పర్తి మండల కేంద్రంలో తహసీల్దార్ పరుశరాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, సన్నరకం బియ్యం పంపిణీని ప్రారంభించారు.



నల్లగొండలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

'రాజీవ్ యువ వికాసం'ను సద్వినియోగం చేసుకోవాలి

చండూరు రూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బండారు యాదగిరి అన్నారు. ఈ పథకానికి అర్హులైన వారు ఈ నెల 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

సోమేశ్వర శివజ్ఞాన పీఠంలో 6న కవి సమ్మేళనం

నార్కట్‌పల్లి: వసంత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చెర్వుగట్టులోని సోమేశ్వర శివజ్ఞాన పీఠం ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 6న కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షురాలు పోతులపాటి అరుణరామలింగేశ్వరశర్మ తెలిపారు. ఈ సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాన్ని బుధవారం ట్రస్టు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షుడు రాజేందర్ శర్మ, దర్మాధికారి జయారపు రామకృష్ణ, కోశాధికారి హరికృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

మునుగోడు రూరల్: పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎల్లగలగూడెం గ్రామానికి చెందిన బక్క కిరణ్‌కి మంజూరైన రూ.26 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు తీర్నారి ఆంజనేయులు, దామ్ రవి, తీర్నారి శ్రీశైలం, తీర్నారి వెంకన్న, బక్క సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: మండలంలోని చొల్లేడు గ్రామానికి చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి పథకం (సీఎంఆర్‌ఎఫ్) కింద చెక్కులు మంజూరయ్యాయి. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సైదులు, నాయకులు బుడిగపాక రవి, వనం యాదయ్య, జనిగల ముత్యాలు, సైదులు, రవీందర్‌రెడ్డి, లింగస్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోటా నుంచి లైట్ల మంజూరు

మునుగోడు రూరల్: ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నిధుల నుంచి మునుగోడు మండల చల్మెడ గ్రామానికి 50విద్యుత్ లైట్లు మంజూరయ్యాయి. వాటిని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జితేందర్‌రెడ్డి గ్రామ పంచాయతీకి అందజేశారు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే మందుల సామేల్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సామేలు

శాలిగౌరారం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యం దళారులకు విక్రయించకుండా మార్కెట్‌కు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, తహసీల్దార్ పి.యాదగిరి, ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహ, సింగిల్‌విండో చైర్మన్ తాళ్లూరి మురళి, పీఏసీఎస్ సీఈవో ఆంజనేయులు, మార్కెట్ కమిటీ కార్యదర్శి చీనానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నా యకులు సుధాకర్, సీఎంరెడ్డి, ఏవో సౌమ్యశృతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జీపీ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్

నల్లగొండరూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు జీపీ కార్మికుల ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయకపోతే జీపీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి సీహెచ్. లక్ష్మీనారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పోతపాక వినోద్‌కుమార్, జిల్లా నాయకులు, తిరిగి ఎల్లేష్, గండమల్ల ఆశీర్వాదం, సర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలి



లచ్చుగూడెం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సహదేవరెడ్డి

కనగల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహదేవరెడ్డి రైతులకు సూచించారు. చెట్లచెన్నారం, లచ్చుగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ. 2320, సాధారణ రకానికి రూ. 2300 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. నిర్వహణ కమిటీల సూచనల మేరకు ప్రతి బస్తా 40.7 కేజీల చొప్పున కాంటా వేయాలని హమాలీలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయరాం, ఏవో అమరేందర్‌గౌడ్, కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా కన్వీనర్ గోలి జగాల్‌రెడ్డి నాయకులు నర్సింగ్ కృష్ణయ్యగౌడ్, నాయకులు యాదవరెడ్డి, గోగు యాదయ్య, సీఈవో రాంచంద్రారెడ్డి, ఏఈవో నవీన్, సిబ్బంది మహేశ్వరం గిరి, గోగు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాపన్న పోరాటం స్ఫూర్తిదాయకం



నల్లగొండ: పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గౌడసంఘం నాయకులు

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్): సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకమని పలువురు నాయకులు కొనియాడారు. జిల్లా వ్యాప్తంగా పాపన్నగౌడ్ చిత్రపటాలు, విగ్రహాల వద్ద గౌడసంఘాలు, వివిధ రాజకీయ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా నల్లగొండ పట్టణ పరిధి కతాల్‌గూడలో పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కారింగ్ నరేష్ గౌడ్, బహుజన సమాజ్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల కాశీరాం, పజ్జూరి అశోక్ గౌడ్ పాల్గొన్నారు. గడియారం సెంటర్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాపననగౌడ్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిలుకరాజు సతీష్, కల్లూరి సత్యనారాయణగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్త లింగస్వామి యాదవ్, బీసీ సంఘం సీనియర్ నాయకులు వైద్యుల సత్యనారాయణ, బీసీ సంఘం నాయకులు కొత్తకొండ రమేష్, ఆమంచి స్వామి, ఉల్లెందుల అంజయ్య పాల్గొన్నారు. కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నల్లగొండ మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు తండు సైదులుగౌడ్, సీఐటీయూ జి ల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పాపన్న గౌడ్ విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు పాలకూరి సం తోష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పజ్జూరి ప్రదీప్‌గౌడ్ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని వృత్తిదారుల సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చేతి వృత్తి దారుల సంఘం జిల్లా కన్వీనర్ గంజి మురళీధర్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, దండెంపల్లి సత్తయ్య, అనురాధ, రవీంద్రకుమార్, సత్యనారయణ పాల్గొన్నారు. కట్టంగూరులో మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో గౌడ ఉద్యోగుల సంఘం ఐక్యవేదిక అధ్యక్షుడు ఎరుకల సత్తయ్యగౌడ్, నాయకులు పెద్ది బాలనర్సింహ, కొంపెల్లి యాదయ్య, పోగుల నర్సింహ, ఈదయ్య, యాదయ్య, రెడ్డిపల్లి మనోహర్, చెవుగోని జనార్ధన్, లక్ష్మీనారాయణ, అంతటి శ్రీను, లక్ష్మయ్య, శ్రీను, నగేష్ ఉన్నారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని విరమించుకోవాలి



చిట్యాలలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


మునుగోడు రూరల్, నార్కట్‌పల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హైదారాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలం నిర్ణయాన్ని వెనెక్కితీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్‌చేశారు. ఈమేరకు బుధవారం మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి మాట్లాడారు. విద్యార్థులపై అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్‌చేశారు.

నార్కట్‌పల్లి : సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నార్కట్‌పల్లిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న మాట్లాడుతూ దశాబ్దాల క్రితం హెచ్‌సీయూకు కేటాయించిన భూమిని ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు విక్రయించడం దారుణమన్నారు. విక్రయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొప్పు శ్రవణ్, ఐలయ్య, అర్థం శ్రీనివాస్, గోపి పాల్గొన్నారు.

కేతేపల్లి: అక్రమ అరెస్టులతో పాలకులు ఉద్యమాలను ఆపలేరని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు అన్నారు. వివిధ సమస్యలపై ఉద్యమిస్తున్న సీపీఎం నాయకుల ముందస్తు అరెస్టులను నిరసిస్తూ మండల కేంద్రం కేతేపల్లిలో ఆ పార్టీ ఆధ్వర్యాన బుధవారం నల్లజెండాలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు జడ వెంకన్న, జటంగి భిక్షమయ్య, బి.అంజయ్య, వెంకన్న, దుర్గయ్య పాల్గొన్నారు.

చిట్యాల: పట్టణంలో నిర్వహించిన రాస్తారోకోలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, మల్లం మహేష్, జిట్ట సరోజ, కత్తుల లింగస్వామి, అరూరి శ్రీను, ఐతరాజు నర్సింహ, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శాలిగౌరారం : మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, నాయకులుమక్క బుచ్చి రాములు, కల్లూరి లింగయ్య, తేలుకుంట్ల జగన్, సైదుల శ్రీను, గుండ్లపల్లి వెంకన్న, సిరిపంగి రాములు, డెంకెల లింగయ్య, బల్లెం వెంకన్న పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.175	230	280
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.190	220	280

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.0 । కనిష్ఠం 23.4



సన్న బియ్యం.. సంతోషం



» బియ్యం పంపిణీ చేసిన తొలిరోజే వండుకున్న మహిళలు

» అన్నం బాగుందని కితాబిచ్చిన ఉమ్మడి జిల్లా మహిళలు

నల్లగొండ,ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం కింద తొలిసారి బియ్యం అందుకున్న మహిళలు ఆ బియ్యం బాగున్నాయని, అన్నం బాగా అయిందని సంబరపడుతున్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో, నల్లగొండ జిల్లా కనగల్ మండలం జి.యడవల్లిలో తొలిరోజు సన్నబియ్యం పొందిన మహిళలను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. ప్రభుత్వమిచ్చిన బియ్యాన్ని వారు వండి చూశారు.బియ్యం నాణ్యతతో ఉన్నాయని, గతంలో మార్కెట్లో తాము కొన్న సోనామసూరి, బీపీటీ తరహాలోనే ఈ బియ్యం కూడా ఉన్నాయని, పచ్చిబియ్యమే వచ్చిందని తెలిపారు. బియ్యం వండిన అన్నాన్ని కూడా 'ఆంధ్రజ్యోతి' బృందానికి చూపించారు. గతంలో ఇచ్చిన రేషన్ బియ్యం దొడ్డుబియ్యం వండిన తర్వాత ముద్దగా మారేదని, ఈ అన్నం అలా కాలేదని ఇది పొల్లుపొల్లుగా బాగుందని మహిళలు పేర్కొన్నారు. మొదటి నెల కింద పంపిణీ చేసిన సన్నబియ్యంపై జిల్లా పౌరసరఫరాల అధికారి హ రీష్‌ని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా, వానాకాలం కొనుగోలుచేసిన సన్నధాన్యానికి సంబంధించి సీఎంఆర్ కింద మిల్లుల ద్వారా వచ్చిన బియ్యాన్నే పంపిణీ చేశామని, పూర్తినాణ్యత కలిగిన ఫోర్టిఫైడ్ చేసిన బియ్యమే అన్ని రేషన్‌దుకాణాలకు సరఫరా చేశామని వెల్లడించారు.

రేషన్‌దుకాణాల వద్ద రద్దీ

రేషన్‌దుకాణాల ద్వారా సన్న బియ్యం ఇస్తుండడంతో మంగళవారం సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లోని రేషన్ దుకాణాల వద్ద రద్దీ కొనసాగింది. గతంలో రేషన్ తీసుకోవడానికి పెద్దగా ప్రాధాన్యం..

- మిగతా 6వ పేజీలో...

అన్నం బాగుంది



మేం కూలి పనులు చేసుకొని జీవిస్తాం. మాకు రేషన్‌కార్డు కింద గతంలో దొడ్డుబియ్యం వచ్చేవి. వాటిని వండుకున్నప్పుడు వేడిగా ఉన్నప్పుడే తినేవాళ్లం. చల్లారాక ముద్దగా అయ్యేది. మధ్యాహ్నానికి తినలేకపోయేవాళ్లం. దీంతో రాత్రి మాత్రమే దొడ్డుబియ్యం వండుకునేవాళ్లం. ఉదయం, మధ్యాహ్నానికి రేటు ఎక్కువైనా దుకాణాల్లో సన్న బియ్యం కొనుక్కొనేవాళ్లం. ఇప్పుడు సన్నబియ్యమే రేషన్‌కింద రావడం చాలా సంతోషాన్ని కలిగించింది.

- పెండెం పద్మ, సూర్యాపేట జిల్లా, గరిడేపల్లి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లాభాల బాటలో పయనిస్తోంది. 103 ఏళ్ల బ్యాంకు చరిత్రలో ఇప్పటి వరకు కేవలం రూ.900కోట్ల టర్నోవర్ ఉండగా, ప్రస్తుతం రూ.2,850కోట్లకు పైగా టర్నోవర్‌కు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం రూ.2,300 కోట్ల టర్నోవర్ ఉండగా, ప్రస్తుతం అదనంగా రూ.550.81కోట్ల టర్నోవర్ సాధించింది. మరో రూ.150 కోట్లు సాధిస్తే రూ.3వేల కోట్ల టర్నోవర్‌తో మరింత లాభాల బాటలో పయనించే అవకాశం ఉంది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

డీసీసీబీకి కాసుల వర్షం

» రికార్డు స్థాయిలో లాభాలు » రాష్ట్రంలో రెండో స్థానం » రూ.2850కోట్లకు పైగా టర్నోవర్

» ఎన్‌పీఏ 1.85శాతం నుంచి 1.38శాతానికి తగ్గుదల » పెరిగిన పంట, బంగారంపై రుణాలు, డిపాజిట్లు

డీసీసీబీలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆడిట్ ప్రకారం నికర లాభం రూ.42.31కోట్లు సాధించింది. 2023-24లో రూ.31కోట్లు లాభం ఉండగా,అదనంగా రూ.12.31కోట్లు లాభాలు సాధించింది. పాలకవర్గం ఎంసీ (మేనేజింగ్ కమిటీ) మీటింగ్‌లతో పాటు మహాజన సభలను నిర్వహిస్తూ అటూ సొసైటీ చైర్మన్లు, బ్యాంకుల సీఈవోలు, అధికారులు, ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ డీసీసీబీ లాభాల బాటలో ముందుకెళ్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో డీసీసీబీ పరిధిలో మొత్తం 107 సొసైటీలు ఉన్నాయి. రైతులకు రుణాలు పెద్ద మొత్తంలో ఇవ్వడంతో పాటు రికవరీ కూడా అంతే వేగంగా చేస్తున్నా రు.వాణిజ్య బ్యాంకుల కంటే అధికంగా రుణాలు మంజూరు చేశారు.బంగారంపై రుణాలు ఈ ఆర్థి క సంవత్సరంలో రూ.328.35కోట్ల నుంచి రూ.623. 91కోట్లకు పెరిగింది. అంటే అదనంగా రూ.295.56 కోట్ల మేర రుణాలు మంజూరు చేశారు. కొన్నేళ్ల క్రితం రాష్ట్రంలో ఉమ్మడి నల్లగొండ డీసీసీబీ స్థానం చివరి నుంచి రెండోదిగా ఉండగా, ప్రస్తుతం పైనుంచి రెండో స్థానానికి చేరింది. దీంతో జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు రాష్ట్రంతో పాటు ఆర్‌బీఐ వద్ద గుర్తింపు లభించింది.



పెరగనున్న కొత్త బ్రాంచ్‌లు, సొసైటీలు

ఉమ్మడి జిల్లాలో బ్రాంచ్‌ల సంఖ్య పెంచనున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో డీసీసీబీకి 36బ్రాంచ్‌లు ఉండగా, అదనంగా మరో ఐదు బ్రాంచ్‌లను త్వరలో ప్రారంభించనున్నారు.దీనికి తోడు మరో ఐదు బ్రాంచ్‌లను..

- మిగతా 6వ పేజీలో...

1.38 శాతానికి తగ్గిన నిరర్థక ఆస్తులు

2023-2024లో 1.85శాతంగా ఉన్న ఎన్‌పీఏ(నిరర్థక ఆస్తులు) ప్రస్తుతం 1.38శాతానికి చేరడంతో బ్యాంకు లాభాలు గడించింది. బ్రాంచ్ విస్తరణతో పాటు సొసైటీల బలోపేతం, ఆధునికీకరణతో రైతులకు సేవలను విస్తరించడంతో బ్యాంకు పురోగతికి చేరుకుంది. దీంతో పాటు ఎప్పటికప్పుడు ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడం, రైతులకు సత్వరమే సేవలు అందించడం, వాణిజ్య బాంకులకు దీటుగా రుణాలు అందిస్తుండటంతో లాభాలు పెరిగాయి. రానున్న రోజుల్లో స్వలకాలిక, దీర్ఘకాలిక, బంగారం, విద్య, వ్యక్తిగత రుణాలను పెంచే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. సహకార బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతుల్లో సైతం అవగాహన పెరిగింది. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లిస్తున్నారు. వడ్డీ భారం పడకముందే రుణాలు తిరిగి చెల్లించి రెన్యూవల్ చేసుకుంటున్నారు. దాదాపు 95శాతం మేర రైతులు సకాలంలోనే రుణాల చెల్లింపు చేస్తున్నారు. బ్యాంకుల నుంచి నోటీసులు రాకముందే రైతులే స్వయంగా వచ్చి రుణాలు చెల్లించి అవసరమైనంతా తిరిగి రుణం తీసుకునేలా రెన్యూవల్ చేసుకుంటున్నారు. దీనికి తోడు మార్ట్‌గేజ్ రుణాలు అంటే భూములను తనఖా పెట్టి రుణాలు పొందుతున్న వారి సంఖ్య పెరిగింది. వారందరికీ ప్రోత్సాహకాలు కల్పిస్తూ సకాలంలో రుణాలు చెల్లించేలా చూస్తుండటంతో డీఫాల్టర్ల సంఖ్య కూడా తగ్గింది.

బ్యాంక్ అభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గం కృషి



- కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పీఏసీఎస్‌లు, బ్రాంచ్‌లు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లు లాభాల బాటలో తీసుకెళ్లేలా పాలకవర్గం కృషి చేస్తోందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ లాభాల బాటలో పయనించిన సందర్భంగా బుధవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో సీఈవో శంకర్‌రావు, డైరెక్టర్లు పాశం సంపత్ రెడ్డి, గుడిపాటి సైదులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 103 ఏళ్లలో లేని అభివృద్ధిని తమ పాలకవర్గం చేయడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ఏటా నిర్వహిస్తున్న ఆడిట్ ద్వారా డీసీసీబీ పెద్ద ఎత్తున అభివృద్ధికి చేరుకుందనే విషయం స్పష్టమైందన్నారు. ప్రస్తుత పాలకవర్గం బాధ్యతలు చేపట్టాక రూ.2,850కోట్లకు పైగా బ్యాంక్ టర్నోవర్ చేరుకోవడంతో డీసీసీబీకి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం లభించిందన్నారు. త్వరలో మరో రెండు నెలల్లో రూ.3వేల కోట్ల టర్నోవర్‌కు చేరుకుంటామని, డిపాజిట్లను పెంచుకోవడం, బంగారం రుణాలను, స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను రైతులకు అందించడంతో పాటు రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందన్నారు. డీసీసీబీ బ్యాంకు అభివృద్ధికి సహకరించిన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రైవేట్ కళాశాలల్లో నిలిచిన ప్రాక్టికల్స్



భువనగిరిలోని ఓ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న యాజమాన్యాలు, లెక్చరర్లు

» డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, లెక్చరర్ల నిరసన

» ప్రభుత్వ కళాశాలల్లో కొనసాగిన పరీక్షలు

భువనగిరి టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, వేతనాల కోసం లెక్చరర్ల బహిష్కరణ ప్రభావం డిగ్రీ ప్రాక్టికల్స్ పరీక్షలపై ప్రభావం చూపింది. ఎంజీయూ పరిధిలోని ఉమ్మడి జిల్లాలో బుధవారం ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభమైనా, ప్రైవేట్‌డిగ్రీ కళాశాలలు తెరుచుకోలేదు. దీంతో ప్రైవేట్ కళాశాలల్లో ప్రాక్టికల్స్ స్తంభించగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రభుత్వ యాజమాన్య గురుకుల కళాశాలల్లో మాత్రం షెడ్యూల్ ప్రకారం పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వంతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో ప్రభుత్వం మొండివైఖరి వీడకుంటే ఈనెల 11 నుంచి ప్రారంభమయ్యే థియరీ పరీక్షలను కూడా బహిష్కరిస్తామని యాజమాన్యాలు ఇప్పటికే ప్రకటించాయి. దీంతో డిగ్రీ విద్యార్థులు,తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. అయితే రెండుమూడు రోజుల్లో సమస్య కొలిక్కి వస్తుందని, ప్రైవేట్ విద్యార్థులు నష్టపోకుండా పరీక్షల రీషెడ్యూల్‌ను ప్రకటిస్తామని ఎంజీయూ అధికారులు పేర్కొంటున్నారు.

నిరసనల పర్వం..

డిగ్రీ ప్రాక్టికల్స్ పరీక్షల మొదటి రోజున ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్ కళాశాలల వద్ద నిరసనల పర్వం కొనసాగింది. యాజమాన్యాల ప్రతినిధులు, లెక్చరర్స్ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. అయితే ప్రాక్టికల్స్‌ను బహిష్కరిస్తున్నట్టు ముందే ఇచ్చిన సమాచారంతో విద్యార్థులు కళాశాలలకు రాలేదు. ఏ-గ్రూపులో 2, 4, 5వ సెమిస్టర్ ప్రాక్టికల్స్ 7, 8, 9వ తేదీల్లో జరగనున్నాయి. ప్రాక్టికల్స్ ముగిసిన రెండు రోజుల అనంతరం ఈ నెల 11వ తేదీ నుంచి థియరీ పరీక్షలు ప్రారంభం కావలసి ఉంది.

ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె



పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె కొనసాగిస్తాం. భారీగా పేరుకుపోయిన బకాయితో యాజమాన్యాల ఆర్థిక స్థితిగతులు తలకిందులయ్యాయి. ప్రభుత్వ వైఖరి కారణంగానే ప్రాక్టికల్స్ పరీక్ష లు బహిష్కరిస్తున్నాం. అందుకు గత అక్టోబరులో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలుపుకోకపోవడమే కారణం. ప్రభుత్వ వైఖరి మారకుంటే ఈనెల 11 నుంచి ప్రారంభమయ్యే థియరీ పరీక్షలను కూడా బహిష్కరిస్తాం.

- బి.సూర్యనారాయణరెడ్డి, ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

పారదర్శకంగా సన్న బియ్యం పంపిణీ



లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీచేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పేదలకు సన్న బియ్యం పంపిణీని పారదర్శంగా నిర్వహిస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, మండలంలో ఖాళీగా ఉన్న చౌకధరల దుకాణాల డీలర్ల పోస్టులను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేస్తామన్నారు. రేషన్‌కార్డు జారీ నిరంతర ప్రక్రియ అని అన్నారు. రైతులు సన్న రకం ధాన్యాన్ని ఎక్కువగా సాగుచేయాలని, క్వింటా ధాన్యానికి రూ.2,320 మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ పొందాలని సూచించారు. ధర్తీ ఆబా యోజన కింద గిరిజన తండాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామన్నారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 14వరకు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేయాలన్నారు. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, మండల స్పెషల్ ఆఫీసర్, డీఆర్‌డీఏ ఏపీడీ శారద, సివిల్ సప్లయ్ జిల్లా అధికారి రమేష్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ అనిల్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, కలసాని చంద్రశేఖర్, ఆంగోతు భగవాన్ నాయక్, గడ్డం సాగర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

4,200 మంది రైతులకు పట్టాలు

మండలంలో ఆరు నెలలుగా నిర్వహిస్తున్న రెవెన్యూ పైలట్ ప్రాజెక్టును కలెక్టర్ సమీక్షించారు. సుమారు 4,700 ఎకరాలకు సంబంధించి 4,200 మంది రైతులకు పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఖాస్తు కబ్జాలో ఉండి వ్యవసాయం చేస్తున్న ప్రతీ రైతుకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు.

మహనీయుల జయంతిని నిర్వహించాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల జయంతిని నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహనీయుల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. అనంతరం పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ, జయంతి వేడుకల సందర్భంగా రిజిస్టర్డ్ సంఘం నుంచి ఒకరికి మాట్లాడే అవకాశం ఇవ్వాలని, మర్రిగూడ జంక్షన్‌కు అంబేడ్కర్ పేరు పెట్టాలని, అంబేడ్కర్ కల్చరల్ భవనానికి మరమ్మతులు చేయాలని, ఉత్సవాలకు హాజరయ్యే విద్యార్థులకు తాగునీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్ కుమార్, అదనపు ఎస్పీ రమేష్, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు, డీసీవో పత్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

మీ కోసమే.. మేమున్నామని..

●7లో..



» పేట జిల్లాలో 'పోలీస్ ప్రజా భరోసా'

» నూతనంగా ప్రారంభించిన ఎస్పీ నర్సింహ

శాంతిభద్రతల పరిరక్షణ, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పన, నేరాల నియంత్రణతో పాటు మీ కోసమే మేమున్నామని చెప్పేందుకు సూర్యాపేట జిల్లాలో నూతన కార్యక్రమానికి ఎస్పీ కొత్తపల్లి నర్సింహ శ్రీకారం చుట్టారు. అందుకోసం రాష్ట్రంలో ఎక్కడా అమలు చేయని విధంగా వినూత్నంగా 'పోలీస్ ప్రజా భరోసా' పేరిట కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి

డీఎంహెచ్‌వో శ్రీనివాస్



పీటీనగర్ పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చింతపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేసినప్పుడే గుర్తింపు ఉంటుందని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని వెంకటేశ్వరనగర్ (మాల్) పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, ఔషధాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు వడదెబ్బకు గురైనప్పుడు అందజేసేందుకు పీహెచ్‌సీలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్యపర సేవలందించి మన్ననలు పొందాలని సూచించారు. గ్రామాల్లో వడదెబ్బకు గురికాకుండా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వంశీకృష్ణ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో చివరి రోజు పరీక్ష రాసివస్తున్న విద్యార్థులు

ముగిసిన పదో తరగతి పరీక్షలు

చివరి రోజు 38మంది గైర్హాజరు

నల్లగొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారం ముగిశాయి. చివరి రోజు సాంఘికశాస్త్ర పరీక్షకు 38మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలోని 105 పరీక్షా కేంద్రాల్లో 18,666 మందికి 18,628మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, డీఈవో భిక్షపతి తెలిపారు. ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయి.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపాలి



నల్లగొండలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల వేలాన్ని, విద్యార్థులు, యూనియన్ నేతలపై పోలీసుల నిర్బంధాన్ని నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున, జిల్లా కమిటీ సభ్యుడు ఎండి సలీం డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని సుభాష్ విగ్రహం దగ్గర బుధవారం ప్లకార్డులు, నల్లరిబ్బన్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 400 ఎకరాల యూనివర్సిటీ భూమిని విక్రయానికి పెట్టే ప్రయత్నాలను విరమించాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన దశలో ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కు తీసుకుని విక్రయానికి పెట్టిందన్నారు. భూమిని విక్రయించవద్దని, యూనివర్సిటీ అభివృద్ధికే వినియోగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చిన్నపాక లక్ష్మీనారాయణ, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పుచ్చకాయల నర్సిరెడ్డి, కొండ అనురాధ, నలపరాజు సైదులు, కోట్ల అశోక్‌రెడ్డి, సత్యనారాయణ, పాల్గొన్నారు.

5న పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఈనెల 5న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువతేజం కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 9నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన యువతీ, యువకులు పేర్లను సమీప పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలో 100కుపైగా కంపెనీలు పాల్గొని 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయన్నారు. యువతీ, యువకులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చలివేంద్రం ఏర్పాటు

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండ్ వద్ద కొండమల్లేపల్లి గ్రాపంచాయతీ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం మాజీ ఎంపీపీ దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి, దేవరకొండ ఆర్టీసీ డీఎం రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు

చింతపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లిరాంనగర్ వనంమైసమ్మ ఆలయంలో బుధవారం అత్యంత వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గణపతి పూజ, పుణ్యావచనం, దేవత ఆహ్వానం, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, హోమం, జలాధివాసం, ధాన్యాధివాసం, తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధగోని కృష్ణగౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

నర్సింహులు, సీఐ, దేవరకొండ



వేసవిలో పిల్లలు స్నానానికి వ్యవసాయ బావులు, చెరువులు, కుంటల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు.

- (దేవరకొండ,ఆంధ్రజ్యోతి)

ఇంటర్వ్యూ Interview

ఆంధ్రజ్యోతి: వేసవిలో పిల్లలు స్నానానికని వ్యవసాయ బావులు, చెరువుల వద్దకు వెళ్లకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సీఐ: వేసవిలో పిల్లలు స్నానానికి చెరువులు, కుంటలు, బావుల వద్దకు వెళ్లి మృత్యువాతకు గురవుతున్నారు. ముందస్తుగానే పిల్లలు చెరువుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వవద్దు.

ఆంధ్రజ్యోతి: పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సీఐ: దేవరకొండ పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా అన్ని చర్యలు చేపడుతున్నాం. వాహనాలు తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: దొంగతనాల నివారణకు చర్యలేవీ?

సీఐ: దొంగతనాల నివారణకు విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. దేవరకొండ పట్టణంతో పాటు గ్రామాల్లో పోలీసులు సంచరించి అనుమానాస్పద వ్యక్తులను గుర్తించే పనిలో ఉన్నాం. ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లేవారు విలువైన వస్తువులు, నగదు ఇంట్లో పెట్టి వెళ్లవద్దని సూచిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రజలకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమిటి?

సీఐ: పోలీస్‌శాఖ సూచించిన నియమ, నిబంధనలను పాటించాలి. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలి. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దు. ఇస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి వస్తుంది.

అంతా ఆన్‌లైన్‌లో

» బిమ్ రశీదులపై చెరిగిపోతున్న ముద్రణ
» ప్రజలు ఆందోళనలో ప్రజలు
» రికార్డులలో పొందుపరుస్తామంటున్న అధికారులు



మునిసిపల్ కార్యాలయంలో పన్నులు చెల్లిస్తున్న యజమానులు

ప్రజలు ఆన్‌లైన్ పేమెంట్లకే మొగ్గు చూపుతున్నారు. ఏది కొనుగోలు చేసినా ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రజలకు సత్వర సేవలందించేందుకు యూపీఐ పేమెంట్స్ స్వీకరిస్తుంది. కొన్ని సందర్భాల్లో ఆఫ్‌లైన్ పేమెంట్లకూ ఆన్‌లైన్ రిసిప్ట్స్ జారీ చేస్తున్నాయి. అంతా బాగానే ఉన్నా ఆన్‌లైన్‌లో చెల్లించిన తర్వాత వచ్చే రశీదులపై ముద్రణ సక్రమంగా ఉండకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. యూపీఐల ద్వారా చెల్లిస్తే ఆన్‌లైన్‌లో నమోదవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ టౌన్)

ఆస్తి పన్ను, నీటి పన్ను, వాణిజ్య రుసుములు సేకరించే మునిసిపాలిటీ పౌరసేవలు సులభతరం చేసే చర్యలకు ఉపక్రమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వాణిజ్య, వ్యాపార సంస్థలతో పాటు గృహ యజమానుల నుంచి పన్ను సేకరించేందుకు బిల్ ఇస్యూయింగ్ మిషన్లు (బిమ్) యంత్రాలను (ఆర్టీసీ బస్‌లో టిమ్‌ల తరహాలో) వినియోగిస్తోంది. అయితే అలా జారీ చేసిన బిల్లులపై ముద్రించిన వివరాలు రోజుల వ్యవధిలోనే చెరిగిపోతున్నాయి.

ఈ తరుణం లో పన్ను, ఇతర రుసుములు చెల్లించిన యజమాను లు ఆందోళన చెందుతున్నారు. అయితే ఎలాంటి ఆందోళన అవసరం లేదని, ఆయా యంత్రాల ద్వారా చెల్లించిన పన్నులు, రుసుముల వివరాలు నేరుగా ఆన్‌లైన్‌లోకి నమోదవుతాయని మునిసిపల్ అధికారులు పేర్కొంటున్నారు.

కరెంట్ బిల్లుల తరహాలో ముద్రిస్తే

మునిసిపాలిటీ ఉద్యోగులు, సిబ్బంది అందించే పన్ను స్వీకరింపు రశీదుల్లో వివరాలు చెరిగిపోతుండగా, విద్యుత్ బిల్లులు, రశీదులపై ముద్రణ అంత త్వరగా చెరగడం లేదంటున్నారు వినియోగదారులు. ఆ తరహా రశీదులు అందించాలని, ఆధునిక సాంకేతికత వినియోగించాలని కోరుతున్నారు. ఇంతకాలం పన్ను సేకరించి చేతిరాతతో రశీదులిచ్చి తదనంతరం రికార్డుల్లో నమోదు చేసేవారు. అటువంటి వాటిలో కొద్దిగొప్పో తప్పులు దొర్లేవని పట్టణ ప్రజలు గుర్తు చేస్తున్నారు. ముద్రణ చెరిగిపోతుందని అధికారుల దృష్టికి తీసుకెళ్తే జీరాక్స్ తీసుకెవాలని నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని పలువురు వాపోతున్నారు.

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



ఇప్పుడన్నీ ఆన్‌లైన్ పేమెంట్‌లే చేస్తున్నారు. గృహ, వ్యాపార కేంద్రాల యజమానులు చెల్లించిన ఆస్తి, నల్లా పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వివరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ఆన్‌లైన్‌లో నమోదవుతాయి. అవగాహన కలిగిన వారు మిన్నకుండినా.. కొంతమంది యజమానులు ప్రింట్ చెరిగిపోయిందని మా దృష్టికి తెస్తున్నారు. మెరుగైన పద్ధతిలో రశీదులు జారీ చేసేందుకు సాంకేతిక నిపుణుల సలహా తీసుకుంటున్నాం.

- జ్ఞానేశ్వరి, మునిసిపల్ రెవెన్యూ ఆఫీసర్

కాంగ్రెస్‌ది నయవంచక పాలన

● మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

గుర్రంపోడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నయవంచక పాలన సాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. గుర్రంపోడు మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవానికి బుధవారం ఆయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని మండల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఇప్పటి వరకు మహిళలకు ఫ్రీ బస్సు మినహా ఎలాంటి హామీని అమలు చేయలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి పరిపాలన అనుభవం లేదని, ఇప్పటికే ప్రజలకు అర్థమైందని అన్నారు. సమావేశంలో కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరావు, నాయకులు వెంకటరెడ్డి, రాములు, నగేష్, వెంకన్న, సురేందర్, శంకర్, గణేష్, బాలరాజు, చంటి, సైదిరెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భగత్

విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

● దేవరకొండ డీఎల్‌పీవో శంకర్‌నాయక్

మర్రిగూడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): విధి ని ర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని దేవరకొండ డీఎల్‌పీవో శంకర్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న నర్సరీ షెడ్డులను, మంచినీటి తొట్లను బుధవారం ఆయన పరిశీలించారు. తమ్మడపల్లి గ్రామపంచాయతీలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ సెక్రటరీలు ఇంటిపన్నులు వసూలు చేసి ఆదాయం పెంచాలని, అదేవిధంగా గ్రామాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందేవిధంగా చూడాలని అధికారులు సూచించారు. సమావేశంలో ఎంపీడీవో మున్నయ్య, ఎంపీవో రవికుమార్, కార్యదర్శులు ఉన్నారు.

ఎర్లీ బర్డ్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎర్లీ బర్డ్ స్కీంను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ కోరారు. బుధవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి ముందస్తు పన్ను చెల్లించే యజమానులకు ప్రభుత్వం 5శాతం రాయితీ అందిస్తుందన్నారు. అధికారులు, ఉద్యోగుల సహకారంతో గతేడాది రూ.11.32 కోట్ల పన్ను సేకరించామన్నారు. ఆస్తి పన్ను వడ్డీపై ప్రభుత్వం 90శాతం రాయితీ ప్రకటించిన అనంతరం రూ.1.70 కోట్లు వసూలు చేశామని తెలిపారు. సమావేశంలో అధికారులు కట్టెబోయిన అంజయ్య, వెంకటరమణ, వెంకన్న, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రద్దీగా ఆర్టీసీ బస్టాండ్



ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ రద్దీగా కనిపించింది. ఉగాది, రంజాన్ పండుగల సెలవులు ముగియడంతో తిరుగు ప్రయాణమైన వారితో బస్టాండ్ ప్రాంగణం కిటకిటలాడింది. తెల్లవారుజామునుంచే ప్రయాణికుల రాకను గమనించిన అధికారులు అందుకనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఇక పది పరీక్షలు ముగియడంతో హాస్టళ్ల, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు తిరుగు ప్రయాణం చేపట్టారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

మాడ్గులపల్లి, పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని మాడ్గులపల్లి ఎంపీడీవో తిరుమలస్వామి, ఎస్ఐ కృష్ణయ్య, పీఏపల్లి మాజీ ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం మాడ్గులపల్లి మండలం కేంద్రంతో పాటు పీఏపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మాడ్గులపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పుల్లెంల సైదులు, ఎంపీవో సంగీత, పంచాయతీ కార్యదర్శి ఖాసీం, వెంకన్న, నరేష్, పెద్దఅడిశర్లపల్లిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్యానాయక్, నాయకులు సతీష్‌రెడ్డి, కుశలయ్య, బాస్కర్‌రెడ్డి, అక్బర్, నిరంజన్, శేఖర్‌రెడ్డి, సత్యనారాయణ, బాబురెడ్డి, రహీం, మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

వేములపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకై ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని బుగ్గబావిగూడెం, వేములపల్లి, శెట్టిపాలెం గ్రామాల్లోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిని రోడ్డు భద్రత కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై ప్రమాదాలకు నిలయంగా మారిన పలు బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామన్నారు. అనంతరం వాహనదారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 5వ తేదీన నల్లగొండలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విలేజ్ రోడ్డు భద్రత కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి

వేములపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వేములపల్లి మండల కేంద్రంలో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జిల్లా యాదగిరి డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి విస్తరణలో భాగంగా మండల కేంద్రంలో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బుస్సు పరమేష్, సత్తిరెడ్డి, ఇమ్మానియేల్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన రామాలయం పాలకవర్గం

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ నూతన పాలకవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి సమక్షంలో మిర్యాలగూడ డివిజన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు నూతన చైర్మన్‌గా శాగం నాగిరెడ్డి, సభ్యులుగా చిక్కెం సోమిరెడ్డి, నలబోతు సైదయ్య, అనుముల సాలయ్య, పిట్టల చంద్రమ్మలతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ భగవాన్‌నాయక్, నాయకులు శాగం పెద్దిరెడ్డి, ఈవో వెంకటనారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం



దామరచర్లలో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

● ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, అడవిదేవులపల్లి, దామరచర్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంతో పాటు అడవిదేవులపల్లి, దామరచర్ల మండలాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సబ్‌కలెక్టర్ నారాయణఅమిత్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. దొడ్డుబియ్యం దొడ్డిదారి పడుతుండటంతో పేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. ఇంతవరకు దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి పథకం అమలులో లేదన్నారు. పేద ప్రజలు ధనవంతులతో సమానంగా సన్న బియ్యంతో భోజనం చేయాలన్న లక్ష్యంతో, పేదల ఆకలి తీర్చేందుకు ప్రతీ నెలా రేషన్‌కార్డుదారులకు ఒక్కో లబ్ధిదారుడికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే సన్న బియ్యం పథకాన్ని పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు, ఎమ్మార్పీఎస్ వర్గీకరణ బిల్లును ఆమోదించి అణగారిన వర్గాల ప్రజల డిమాండ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీర్చిందన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు మైబూబ్‌అలీ, పొదిల శ్రీనివాస్, కొమ్ము శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, గంధం రామకృష్ణ, కొమ్మన నాగలక్ష్మి, పొదిల వెంకన్న అంబటి కృష్ణ, రేషన్‌డీలర్లు అహ్మద్, శిరీష తదితరులు పాల్గొన్నారు. అడవిదేవులపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొదిల శ్రీనివాస్, స్కైలాబ్ నాయక్, మండల కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. దామరచర్లలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, డీలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పథకం పేదలకు వరం : ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

త్రిపురారం: సన్నబియ్యం పథకం పేదలకు వరమని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. త్రిపురారం మండలంలోని ఘంటారావుక్యాంపు గ్రామంలో బుధవారం సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించి పేదలకు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముడిమాళ్ల బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ సలహాదారుడు అనుముల శ్రీనివాస్‌రెడి, భాస్కర్ నాయక్, పద్మ, బిట్టు రవికుమార్, వెంకటరెడ్డి, తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీవో విజయకుమారి తదితరులు పాల్గొన్నారు. నిడమనూరులో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, యూత్ కాంగ్రెస్ నాయకుడు మేరెడ్డి వెంకట్ బాబు సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించారు. సన్నబియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి నర్సింహాచారి, శేషరాజు శ్రీనివాస్, లక్ష్మినరేష్, మన్నెం శంకర్, శేషరాజు దాసు, పురుషోత్తమ్‌రెడ్డి పాల్గొన్నారు.

బార్ అధ్యక్ష పదవికి ముఖాముఖి

మిర్యాలగూడలీగల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 10వ తేదీన జరగనున్నాయి. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అధ్యక్ష పదవికి ముఖాముఖి పోటీ నెలకొంది. అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాదులు నేతి సత్యనారాయణ, మైనం మహేష్‌లు పోటీపడుతున్నారు. జనరల్ సెక్రటరీ పదవికి అలుగుబెల్లి రాజ్‌కుమార్‌రెడ్డి, పి.విజయసారధి, ఉపాధ్యక్ష పదవికి లింగంపల్లి శ్రీనివాస్, సుండి శ్రీనివాస్, మహిళా ప్రతినిధి పదవికి దుగ్గిరాల శ్రీదేవి, గంగాభవానీ ముఖాముఖి తలపడుతున్నారు. మిగిలిన పదవులనల్ని ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు ఏచూరి శ్రీనివాస్, విగ్రహాల సుధాకర్‌రావు, పవన్‌కుమార్, సైదులు తెలిపారు.

'మార్కెట్ ఏర్పాటు చేయాలి'

దేవరకొండ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో సమీకృత మార్కెట్ ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుండాల అంజయ్యయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దేవరకొండలో మార్కెట్ ఏర్పాటుకు నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా స్థల సేకరణలో అధికారులు జాప్యం చేస్తున్నారని విమర్శించారు. మార్కెట్‌ను ఏర్పాటు చేసి మార్కెట్‌లో దళారుల బెడదను అరికట్టాలని ఆయన కోరారు.

హెచ్‌సీయూ భూముల విక్రయాన్ని నిలిపివేయాలి



నిడమనూరులో కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నిడమనూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూముల విక్రయాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను మాట్లాడుతూ హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూములను ప్రభుత్వం అమ్మకానికి పెట్టడం శోచనీయని, భూముల విక్రయాలను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రాత్రికి రాత్రే జేసీబీలతో అటవీ సంపదను నాశనం చేసిందని ఆరోపించారు. హైదరాబాద్ నగరానికి ఆక్సీజన్ అందించే అటవీ సంపదను, అక్కడ ఉన్న వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యార్థి సంఘం, తమ పార్టీ నాయకుల అక్రమ అరెస్టులు సరి కాదన్నారు. నియంత పోకడలు మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కందుకూరి కోటేష్, కొమాండ్ల గుర్వయ్య, మల్లికంటి చంద్రశేఖర్, ఆకారపు నరేష్, కుంచం శేఖర్, వింజమూరి శివ, బాలనారాయణ, కేశవులు, పుల్లయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువవికాసానికి దరఖాస్తు చేసుకోవాలి



దేవరకొండ మునిసిపాలిటీలో ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ సుదర్శన్

దేవరకొండ, మాడ్గులపల్లి, హాలియా, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులైన వారు యువతీ, యువకులు దరఖాస్తులు చేసుకోవాలని దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, మాడ్గులపల్లి ఎంపీడీవో తిరుమలస్వామి, హాలియా మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, ఎంపీడీవో సుజాత అన్నారు. బుధవారం దేవరకొండ మునిసిపాలిటీ పరిధిలోని ప్రజలు చేసుకున్న దరఖాస్తులను ఆయన పరిశీలించారు. అర్హులందరూ రాజీవ్ యువ వికాస పథకానికి ప్రజాపాలన సేవా కేంద్రం ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మాడ్గులపల్లిలో ఎంపీడీవో తిరుమలస్వామి మాట్లాడుతూ అర్హులైన వారు ఈ నెల 14వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో లేదా ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. హాలియాలో మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, ఎంపీడీవో సుజాత మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులు రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి చేయాలి : జైవీర్‌రెడ్డి



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమానికి హాలియా మార్కెట్ కమిటీ, లయన్స్ క్లబ్ కృషి చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. అనుముల మండలం కొత్తపల్లి గ్రామంలో మార్కెట్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. హాలియా మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు అనుబంధంగా అదనపు ఆదాయం చేకూరేందుకు పశుపోషణ ముఖ్యమైందని అన్నారు. పశుపోషణకు అవసరమైన మందులు వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడంతో రైతులకు ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు. గ్రామాల్లో వెటర్నరీ సిబ్బంది లేకుంటే తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైన చోట ఏర్పాటు చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా హాలియా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తిరుమలగిరి కస్తూర్బా పాఠశాలలో బోర్ వేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రైతులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి, జిల్లా మిల్లర్స్ గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వీరమళ్ల శ్రీనివాస్, మార్కెట్ వైస్ చైర్మన్ కాంసాని చంద్రశేఖర్, నాయకులు అలుగుల బ్రహ్మారెడ్డి, రమణారెడ్డి, కోటిరెడ్డి, రఘుపతిరెడ్డి, వెంకటరెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి సక్రునాయక్, సభ్యులు బాలకృష్ణ, కృష్ణయ్య, మంచుకొండ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు ఈదయ్య, గౌస్, లక్ష్మణ్, సెక్రటరీ జూలకంటి వెంకటరెడ్డి, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడాలి

● హెచ్‌సీయూ భూములను అన్యాక్రాంతం చేయవద్దని విద్యార్థి సంఘం నాయకుల డిమాండ్

(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)

ఆంధ్రజ్యోతి జన వాక్యం

హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ భూములను అన్యాక్రాంతం చేయవద్దని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా షేర్‌లింగంపల్లిలోని కంచె గచ్చిబౌలి గ్రామంలోని సర్వే నెం.25లో ఉన్నట్లుగా పేర్కొన్న 400 ఎకరా ల భూమిలో చేపట్టిన అభివృద్ధి పనులను విద్యార్థులు వ్యతిరేకిస్తున్నారు. పచ్చదనంతో నిండిన ప్రాంతాన్ని కాంక్రీట్ జంగిల్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని, చెట్లను తెగనరికి నిర్మాణాలు చేపట్టాలని చూస్తున్నారంటూ విద్యార్థులు చేపట్టిన నిరసన కా ర్యక్రమాలను ప్రభుత్వం తిప్పికొడుతోంది. ప్రకృతి ప్రసాదించిన భూములను వాణిజ్య అవసరాలకు వినియోగించకూడదని అన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థి సంఘం నాయకులు, హెచ్‌సీయూ పూర్వ విద్యార్థుల అభిప్రాయాలు ఉన్నాయి.

చరిత్ర ఆనవాళ్లకు తుడిచే ప్రయత్నమే



సెంట్రల్ యూనివర్సిటీ భూములను అన్యాక్రాంతం చేయడమంటే చరిత్ర ఆనవాళ్లకు తుడిచే ప్రయత్నమే. వృక్షాలు, జంతు, పక్షులతో కూడిన పచ్చని ప్రాంతాన్ని కదిలించొద్దు. జీవ వైవిధ్యానికి విఘాతం కలిగించే అభివృద్ధి ఎంతమాత్రం అవసరం లేదు. ప్రభుత్వం పునరాలోచించాలి. దేశంలోనే ప్రత్యేక గుర్తింపు కలిగిన విద్యాలయానికి, ప్రకృతికి హాని తలపెడితే సహించదు విద్యార్థి లోకం.

● గుండా ప్రసాద్, ఆర్యవైశ్య విద్యార్థి సంఘం వ్యవస్థాపకుడు, మిర్యాలగూడ

విద్యార్థులపై కేసులు దుర్మార్గం



విద్యార్థులను అరెస్ట్ చేయడం పరిపాటిగా మారింది. ప్రకృతిని పరిరక్షించమన్న విద్యార్థులపై అక్రమ కేసులు నమోదు చేయడం దుర్మార్గమైన చర్య. వారిని వెంటనే విడుదల చేయాలి, హెచ్‌సీయూ భూములను పరిరక్షించాలి. ప్రాణవాయువు ఇచ్చే ఒక్క చెట్టును కూడా తొలగించవద్దు. పరిశోధక కేంద్రాలుగా ఉన్న విద్యాలయ ప్రాంగణాలను వ్యాపార కేంద్రాలుగా మార్చవద్దు.

● మూడావత్ రవినాయక్, డీవైఎఫ్ఐ, గిరిజన విద్యార్థి సంఘం నాయకుడు